

ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు

కేంద్రం	మి.మీ.లు
కాపులుప్పాడ	153.75
పరదేశిపాలెం	142.25
భీమునిపట్నం	134.0
అక్కిరెడ్డిపాలెం	133.75
ఆనందపురం	131.5
మధురవాడ	129.0
గంభీరం	123.25
పెందుర్తి	124.8
పెదగంట్యాడ	121.4
గాజువాక	114.8
శ్రీరామ్‌నగర్ (పెదగంట్యాడ)	114.24
విశాఖ రూరల్	112.8
పెందుర్తి పీఎస్	111.25
ములగాడ	109.0
పెదగంట్యాడ హైస్కూలు	104.25

రెడ్ అలర్ట్

నగరంలో కుమ్మేసిన వాన

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం
- పొంగిన గెడ్డలు, వాగులు
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- రోడ్లపై వర్షంనీటితో ట్రాఫిక్‌కు అంతరాయం
- భీమిలి, పెందుర్తిలో చెరువుల్లోకి చేరిన నీరు
- బీచ్‌రోడ్డులో ఉప్పొంగిన వరద
- తీరంలో ఎగసిపడుతున్న అలలు
- కాపులుప్పాడలో 153.75 మి.మీలు
- నేడూ నగరంలో కుంభవృష్టి వర్షాలు
- విశాఖ, గంగవరం పోర్టుల్లో మూడో నంబరు భద్రతా సూచిక
- నేడు పాఠశాలలకు సెలవు ప్రకటించిన కలెక్టర్


వన్‌టౌన్‌లోని మునిసిపల్ స్టేడియం వద్ద నిలిచిన వర్షం నీరు

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):

జిల్లాకు తుఫాన్ హెచ్చరిక కేంద్రం రెడ్ అలర్ట్ జారీచేసింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపిలేకుండా జడివాన కురిసింది. కాగా ఆదివారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు పలుచోట్ల కుంభవృష్టి వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్, జీవీఎంసీ, విశాఖ, భీమిలి ఆర్డీవో, 11 మండలాల తహశీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటుచేశారు. భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ సెలవు ప్రకటించారు.

రుతుపవన ద్రోణి విశాఖ మీదుగా పయనించే క్రమంలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు నగరం, జిల్లాలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో గెడ్డలు, వాగులు పొంగాయి. దీనికితోడు ఆదివారం ఉదయం విశాఖకు సమీపంలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీంతో సముద్రం నుంచి భారీగా తేమ గాలులు ఉత్తరాంధ్రపైకి రావడంతో ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం పడుతూనే ఉంది. నైరుతి రుతుపవనాల ప్రవేశం తరువాత రోజంతా భారీ వర్షం కురవడం ఇదే ప్రథమం. రెండు నెలలుగా ఎండలతో ఠారెత్తిన ప్రజలకు శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలు ఉపశమనం కలిగించాయి.నగరం కంటే భీమిలి, ఆనందపురం, ... మిగతా 6వ పేజీలో

స్త్రీశక్తికి అనూహ్య స్పందన

కుండపోత వర్షమైనా తగ్గని మహిళల రద్దీ

- 78 శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదు
- శ్రీకాకుళానికి 6, విజయనగరానికి 4 అదనపు సర్వీసులు
- నాన్‌స్టాప్, అల్ట్రాడీలక్స్ సర్వీసులకూ పెరిగిన డిమాండ్
- సీసీ కెమెరాలతో ట్రాఫిక్ పర్యవేక్షిస్తున్న అధికారులు


ద్వారకాబస్‌స్టేషన్‌లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):

స్త్రీశక్తికి ఆదివారం అనూహ్య స్పందన లభించింది. వారాంతపు సెలవు, కుండపోత వర్షం పడుతున్నా మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిపోయింది. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు అధికారులు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు అదనపు బస్సులు నడపాల్సిన పరిస్థితి ఎదురయింది. సగటు ఆక్యుపెన్సీ రేషియో 78 శాతంగా నమోదయింది.

శ్రావణమాసంలో శుభకార్యాలు ఉండడం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కావడంతో రద్దీ ఏర్పడింది. ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రాపల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు డిమాండ్ పెరిగింది. కుండపోత వర్షం కురుస్తున్నా మహిళలు ప్రయాణాలు సాగించారు బస్సుల రాకపోకలు సాగించే అన్ని రూట్లలోను డిమాండ్ కొనసాగింది. సీటింగ్ కెపాసిటీకి మించి మహిళా ప్రయాణికులు ఉండటంతో అదనపు సర్వీసులు నడిపారు. ద్వారకా బస్ స్టేషన్ నుంచి శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, ... మిగతా 6వ పేజీలో

టీచర్లకూ పరీక్షే!

- ఎఫ్‌ఏ-1లో తార్కిక ఆలోచనతో కూడిన ప్రశ్నలు
- ఒకటి నుంచి ఎనిమిది తరగతుల విద్యార్థుల్లో అయోమయం
- జవాబులు రాయలేక ఆపసోపాలు
- విద్యార్థులతో పాఠశాల విద్యాశాఖ ఆటలు




విద్యాశాఖ రూపొందించిన ఎఫ్‌ఏ-1 బుక్‌లెట్, మూల్యాంకనం చేసేందుకు బుక్‌లెట్‌లను ఇంటికి తీసుకువెళ్తున్న ఉపాధ్యాయుడు

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):

ఈనెల 11 నుంచి 14 వరకు నిర్వహించిన ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ)-1 పరీక్షలలో పాఠశాల విద్యాశాఖ చేసిన ప్రయోగాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు ఉన్నతాధికారుల అనాలోచిత ఆలోచనతో రూపొందించిన ప్రశ్నపత్రాలకు అనుగుణంగా జవాబులు రాయడంతో విద్యార్థులు తెల్లమొహాలు వేశారు. జవాబుపత్రాలను మూల్యాంకనం చేసే టీచర్లకు కూడా చాలా వరకు ప్రశ్నలు అర్థంకాకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు.

పరీక్షలంటే రెండు తెల్లకాగితాలపై జవాబులు రాసే విధానానికి స్వస్తిపలికి, బుక్‌లెట్లు ముద్రించి ఏడాది పొడవునా అన్ని పరీక్షలు రాసుకునేందుకు విద్యాశాఖ వీలు కల్పించింది. దీంతో టీచర్లంతా సంతోషించారు. విద్యార్థి సామర్థ్యం అంచనా వేయడానికి ఇది ప్రామాణికంగా నిలుస్తుందని భావించారు. అయితే ప్రశ్నపత్రాలను మార్చేయడంతో ముఖ్యంగా ఒకటోతరగతి నుంచి ఎనిమిదోతరగతి వరకు విద్యార్థులు జవాబులు రాయడానికి ఇబ్బందిపడ్డారు. గత పాలకులు ప్రపంచ బ్యాంకుతో కుదుర్చుకున్న ఒప్పందం (సాల్ట్ ప్రోగ్రామ్) మేరకు ఎఫ్‌ఏ-1,3, ఎస్‌ఏ-1 ప్రశ్నపత్రాలు రూపకల్పన బాధ్యత ప్రథమ అనే సంస్థకు అప్పగించారు.

సిలబస్‌ను కాదని...

ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లంతా సిలబస్ మేరకు పాఠాలు బోధించి, అందులోంచే ప్రశ్నపత్రం రూపొందించేవారు. ప్రపంచబ్యాంకుతో కుదిరిన ఒప్పందానికి అనుగుణంగా ఈ ఎఫ్‌ఏ-1 పరీక్షల్లో తార్కిక విధానం,అనువర్తిత (అప్లికేషన్ మెథడ్) విధానంలో ప్రశ్నపత్రాలు రూపొందించింది. దీంతో విద్యార్థులు జవాబులు రాయలేకపోయారని టీచర్లు వ్యాఖ్యానించారు. జవాబుపత్రాల మూల్యాంకనం చేసే వారికే కొన్ని ప్రశ్నలు అర్థంకాలేదు. మూల్యాంకనంచేసే ముందు గతంలో బోధించే పాఠాలను ఒకటికి రెండుసార్లు చదువుకోవాల్సి ... మిగతా 6వ పేజీలో

నత్తనడకన యూనిటీ మాల్ పనులు

- భీమిలి బీచ్‌రోడ్డులో రూ.172 కోట్లతో నిర్మించేందుకు ప్రణాళిక
- ఈ ఏడాది మేలో వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని
- ఇప్పటివరకూ ప్రారంభం కాని నిర్మాణం
- వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిచేస్తామని పార్లమెంటులో కేంద్ర మంత్రి ప్రకటన


కేటాయించిన స్థలంలో రహదారి నిర్మాణం. (ఇన్‌సెట్‌లో) యూనిటీ మాల్ డిజైన్

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం-భీమిలి బీచ్ రోడ్డులో యూనిటీ మాల్‌ను 2026 మార్చి నాటికి పూర్తిచేస్తామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్‌ప్రసాద్ రెండు రోజుల క్రితం పార్లమెంటులో వెల్లడించారు. మాల్ నిర్మాణాని కి ఈ ఏడాది మే రెండో తేదీన ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రామానాయుడు స్టూడియో సమీపాన ఐదు ఎకరాలు కేటాయించింది. యూనిటీ మాల్‌ను దాదాపు రూ.172 కోట్లతో నిర్మించాలనేది ప్రణాళిక. దీనికి తొలి దశలో రూ.86 కోట్ల రుణం మంజూరైంది. దీనిని సున్నా వడ్డీతో 50 ఏళ్లలో చెల్లించాల్సి ఉంది. వాస్తవానికి ఇక్కడ కొండపైకి మట్టి రోడ్డును మాత్రమే వేశారు. నిర్మాణం పూర్తి చేయడానికి రెండేళ్లు పడుతుంది. కానీ కేంద్ర సహాయ మంత్రి మాత్రం దానిని ఏడు నెలల్లోనే పూర్తి చేస్తామని చెప్పడం గమనార్హం. 'ఒక జిల్లా...ఒక ఉత్పత్తి' నినాదంతో కేంద్ర ప్రభుత్వం ఆయా జిల్లాల్లో స్థానిక ... మిగతా 6వ పేజీలో

కొత్తగాజువాకలో గ్యాస్ లీక్

రేగిన మంటలు... ముగ్గురికి గాయాలు

- పెద్ద సిలిండర్ నుంచి చిన్న సిలిండర్‌కు గ్యాస్ నింపుతుండగా ప్రమాదం
- కేసు నమోదు చేసిన పోలీసులు, సివిల్ సప్లై అధికారులు


గాయపడిన కృష్ణారావు, బాలిక ఎన్.శిరీష, ఎన్.లక్ష్మి

గాజువాక, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):

కొత్తగాజువాక జంక్షన్‌లోని ఓ దుకాణంలో ఆదివారం గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. దుకాణం నిర్వాహకుడు మొల్లేటి కృష్ణారావు (56), నీలాపు లక్ష్మి (43), నీలాపు శిరీష (9)లకు గాయాలయ్యాయి. స్థానికులు మంటలను అదుపుచేయడంతో భారీప్రమాదం తప్పగా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగాజువాక జంక్షన్‌లో మొల్లేటి కృష్ణారావు గ్యాస్ స్టవ్ రిపేరింగ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. దీంతో పాటు పెద్ద సిలిండర్ల నుంచి అక్రమంగా చిన్న సిలిండర్లలోకి గ్యాస్‌ను నింపి విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో స్థానికురాలు నీలాపు లక్ష్మి చిన్న సిలిండర్‌లోకి గ్యాస్‌ను నింపించుకునేందుకు తన మనవరాలు శిరీషతో కలిసి ఆదివారం దుకాణం వద్దకు వచ్చింది. సిలిండర్‌లోకి ... మిగతా 6వ పేజీలో

డిగ్రీ ప్రవేశాలకు ఎదురుచూపులు

- ఆగస్టు మూడో వారమైనా విడుదల కాని షెడ్యూల్
- గత ఏడాది జూలైలోనే షెడ్యూల్ విడుదల
- ఈ ఏడాది ఇప్పటికీ పట్టించుకోని విద్యాశాఖ
- ప్రత్యామ్నాయ కోర్సుల వైపు పలువురి దృష్టి
- అడ్మిషన్లు తగ్గుతాయని కాలేజీ యాజమాన్యాల ఆందోళన



విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం వేలాది మంది ఎదురుచూస్తున్నారు. ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడి మూడు నెలలు దాటుతున్నా ఉన్నత విద్యా శాఖ ఇప్పటి వరకూ డిగ్రీ అడ్మిషన్‌లకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేయలేదు. సాధారణంగా ఇంటర్ ఫలితాలు వెలువడిన నెల రోజుల్లో షెడ్యూల్‌ను విడుదల చేస్తుంటారు. ఈ ఏడాది మాత్రం ఇప్పటికీ విడుదల కాకపోవడంతో అడ్మిషన్స్‌పై ప్రభావం పడుతుందని కాలేజీల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

డిగ్రీలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య గత కొన్నాళ్లుగా తగ్గుతోంది. ప్రవేశాల ప్రక్రియ ఆలస్యమైతే మరింత తగ్గే అవకాశం ఉందన్న ఆందోళన యాజమాన్యాల్లో వ్యక్తమవుతోంది. కరోనా తరువాత డిగ్రీతోపాటు ఇతర ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ఆలస్యమవుతోంది. గత ఏడాది కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించి ఇంజనీరింగ్, డిగ్రీ వంటి కోర్సుల్లో ప్రవేశాల షెడ్యూల్‌ను వేగంగా విడుదల చేసింది. కానీ, ఈ ఏడాది ఆగసు మూడో వారం వచ్చినప్పటికీ షెడ్యూల్ విడుదల కాలేదు. దీనికి ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య నెలకొన్న విభేదాలే కారణంగా చెబుతున్నారు. నూతన విద్యా విధానంలో భాగంగా డిగ్రీలో సింగిల్ మేజర్, డబుల్ మేజర్ సబ్జెక్టులను తీసుకురావాలని ప్రభుత్వం భావించింది. ఉన్నత విద్యాశాఖలో పనిచేసే ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య సమన్వయలోపంతో షెడ్యూల్ విడుదలలో జాప్యం ఏర్పడింది. ఎట్టకేలకు సింగిల్ మేజర్ సబ్జెక్టుకు ఓకే అయినట్టు తెలుస్తోంది.

ఏయూ పరిధిలో సుమారు 191 డిగ్రీ కాలేజీలున్నాయి. వీటిలో ఏటా 30 నుంచి 35 వేల మంది వివిధ కోర్సుల్లో చేరుతుంటారు. వైసీపీ హయాంలో అడ్మిషన్లు 28 వేలకు పడిపోయాయి. గత ఏడాది 33 వేల మంది చేరారు. ఈ ఏడాది ప్రక్రియ ఆలస్యం కావడంతో అడ్మిషన్లపై ప్రభావం పడుతుందని యాజమాన్యాలు అంటున్నాయి. విద్యార్థులు, ఇంజనీరింగ్ వైపు ఆసక్తి చూపించడం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు తగ్గుముఖం పట్టడానికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. గ్రామీణ ప్రాంత ... మిగతా 6వ పేజీలో

గోస్తనీ నదిలో పెరిగిన నీటి ప్రవాహం



ఉధృతంగా ప్రవహిస్తున్న గోస్తనీనది

తగరపువలస, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడూ అడుగంటిన నీటితో ఉండే గోస్తనీ నది వరాలు పడడంతో గత రెండు రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. మజ్జివలస, నగరపాలెం, తాటితూరు ప్రాంతాల వద్ద నది నీటి ప్రవాహం పెరిగింది. నది ప్రవాహం పెరగడంతో ఈ నీటిని దాటుకుని సామేయవలస, మునివానిపాలెం, సంగివలస ప్రాంతాలకు వెళ్లేవారంతా చుట్టూ తిరిగి వెళుతున్నారు. తగరపువలస వంతెన కింద నుంచి కూడా నది ప్రవాహం ఎక్కువగా ఉంది. ఈ నది తగరపువలస దాటిన తర్వాత నాగమయ్యపాలెం, మూలకుద్దుల మీదగా భీమిలిలో సముద్రంలో కలుస్తుంది. అనంతగిరి కొండల్లో పుట్టిన ఈ నది జామి మండలం తాటిపూడి రిజర్వాయర్‌లోకి చేరి అక్కడ నిల్వ ఉండిపోతుంది. రిజర్వాయర్ నిండిన సమయంలో దాని గేట్లు ఎత్తివేస్తే నదిలోకి నీరు వస్తుంది. రెండురోజులుగా వర్షాలు కురుస్తుండడంతో నదికి ఆనుకుని ఉన్నగ్రామాల నుంచి పిల్ల కాల్వలు నదిలో చేరడంతో పాటు రిజర్వాయరు గేట్లు కూడా ఎత్తివేయడంతో నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉందని అంటున్నారు వర్షాలు కురుస్తున్న సమయంలో ఇదే విధంగా నదిలో నీరు ఎక్కువగా ప్రవహిస్తుంది. ఈసారి రిజర్వాయరు గేట్లు కూడా ఎత్తివేయడంతో నదిలో మరింత నీరు చేరిందని రైతులు అంటున్నారు. ఈ ప్రవాహం ఎక్కువ అయితే నదిని ఆనుకుని ఉన్న పంట భూముల్లోకి కూడా నీరు చేరుతుందని రైతులు అప్రమత్తంగాఉండాలని అధికారులు కోరుతున్నారు..

'దళితులను అవమానించడం తగదు'



తాళ్లవలస అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

భీమునిపట్నం (రూరల్) ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు ఎక్కువయ్యాయని, ముఖ్యంగా దళిత మహిళల పట్ల వివక్ష పెరిగిందని వీటిని నిరోధించాలని కోరుతూ ఆదివారం భీమిలి రూరల్ మండలం తాళ్లవలస జాతీయ రహదారిపై అంబేడ్కర్ విగ్రహం వద్ద బి.సన్నిబాబు ఆధ్వర్యంలో దళిత నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి బాగం గోపాలరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. శ్రీకాకుళం జిల్లా పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా చేస్తున్న దళిత మహిళ పట్ల ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తప్పుడు ఆరోపణలతో బదిలీ చేశారన్నారు. ఇటువంటి ఇబ్బందులు అనేక ప్రాంతాల్లో దళిత మహిళలు ఎదుర్కొంటున్నారన్నారు. అసెంబ్లీలో 30 మందికి పైగా దళిత శాసనసభ్యులున్నా వారెవరూ స్పందిచకపోవడదం శోచనీయమన్నారు. దళిత మహిళ హోం మంత్రిగా ఉన్నా ఇటువంటి దాడులు జరుగుతుండడం సిగ్గుచేటు అన్నారు. దళితులపై దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు సియాద్రి రాంబాబు, యాగాటి రామారావు, బోని ప్రసాద్, నర్సింగరావు లోకేష్, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పంట

» అన్నదాతల ఆవేదన » భీమిలిలో 134 మి.మీ. వర్షపాతం నమోదు » పాతపరదేశిపాలెం వంతెన పైకి వరదనీరు



నీటమునిగిన పాతపరదేశిపాలెం వంతెన



కాపులుప్పాడలో నీట మునిగిన వరి పంట

భీమునిపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భీమిలిలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కరిసింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో సాయంత్రానికి 133.6 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. భారీ వర్షం కారణంగా మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. లోతట్టు ప్రాంతాలైన తోటవీధి, బోయవీధి, ఎగువపేట మత్స్యకారులు ఇబ్బందులు పడ్డారు. కాపులుప్పాడలో వరి పంట వర్షపునీటిలో మునిగిపోయింది. రైతు బోర రామిరెడ్డి తన నాలుగెకరాల వరిపంట వర్షం దెబ్బకు మునిగిపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పలువురు రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. కాపులుప్పాడ, పాతపరదేశిపాలెం గంభీరం గెడ్డపై ఉన్న వంతెన నీట మునిగింది. గంభీరం గెడ్డ పొంగి ప్రవహించడంతో ర్యాంప్ పై నుంచి నీరు ప్రవహించింది. అసలు కల్వర్టు ఎక్కడ ఉందో తెలియనంతగా నీట మునిగింది. అక్కడ రహదారి పూర్తిగా నీట మునిగి పెద్ద చెరువును తలపించింది.

దీంతో ఆయా గ్రామాల ప్రజలు పాతపరదేశిపాలెం, కాపులుప్పాడ, ఎస్సీకాలనీ ప్రజలు బోయపాలెం మీదుగా ఆయా గ్రామాలకు చేరుతున్నారు.

పాండ్రంగిలో కాజ్‌వే పై నుంచి రాకపోకలు నిషేధం

పద్మనాభం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గత మూడు నెలలుగా ముఖం చాటేసిన వర్షాలు రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుసున్నాయి. మండలంలో ఇప్పటి వరకు 89.8 మి.మీ వర్షపాతం నమోదైంది. వరద నీరు చేరడంతో గోస్తనీ నదిలో ప్రవాహం పెరిగింది. పాండ్రంగి పంచాయతీ పరిధిలో ప్రైవేటు లే అవుట్ వారు కాలువలను కప్పి ప్రహరీ గోడలు నిర్మించడంతో నీరు పోయే మార్గం చిన్నది కావడంతో పంట పొలాలు నీట మునిగాయి. గోస్తనీ పరివాహక ప్రాంతాలైన మద్ది, విలాస్కాన్ పాలెం, పొట్నూరు తదితర గ్రామాల్లోపలు చోట్ల పంట పొలాలు నీట మునగడంతో పాటు, రోడ్లు బురదయమయం తయారయ్యాయి. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఇప్పటికే వేసిన వరినాట్లు నీట మునగడంతో పంటకు నష్టం వాటిల్లుతుందేమోనని రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పలు చోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర విఘాతం కలిగింది. రెడ్డిపల్లి-చిన్నాపురం జంక్షన్ తదితర చోట్ల రోడ్లు శిథిలమవడంతో ఆ గోతులలో నీరు చేరి వాహన చోదకులకు గోతులు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. పొట్నూరు కాజ్‌వే మీదుగా వర్షం నీరు ప్రవహిస్తోంది. పాండ్రంగిలో కాజ్‌వేపై వరద ప్రవాహం పెరగడంతో ఇప్పటికే రాకపోకలు నిషేధించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.



మద్ది గ్రామంలో నీట మునిగిన వరి పంట

రోడ్లపైకి వరద నీరు : రాకపోకలకు అంతరాయం



ఎక్స్‌కవేటర్‌తో బురద తొలగిస్తున్న దృశ్యం

తగరపువలస, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస జాతీయరహదారి సర్వీసు రోడ్డులోకి వర్షపు నీటి ప్రవాహం చేరడంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. ఈ ప్రాంతంలో ఉన్న సంగివలస, సబ్బివానిపేట ప్రాంతాల్లో మురుగునీటి పారుదల కాల్వలు లేకపోవడం వల్ల వర్షపు నీరు కాలవలపై నుంచిప్రవహించి సర్వీసు రోడ్డులోకి చేరింది. గతంలో తుఫాను సమయంలో కాల్వల నిర్మాణాలుచేపడతామని జీవీఎంసీ అధికారులు ప్రకటించారు. కానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. సర్వీసు రోడ్డులోకి చేరిన నీరు సమీపంలో ఉన్న చెరువులోకి వెళ్లడానికి వీలుగా ఏర్పాటు చేసిన కాల్వలు కూడా మూసుకునిపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. ఈ నీరు చెరువులోకి వెళ్లడానికి గతంలో అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూడాలని కోరారు. కానీ అధికారులు తాత్కాలిక ఏర్పాట్లతోనే సరిపుచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. వర్షంతో పాటు బురద, మట్టి కూడా కొట్టుకుని వచ్చి సర్వీసు రోడ్డులో పేరుకొనిపోవడంతో అధికారులు ఎక్సకవేటర్లను రప్పించి వాటిని తొలగించే ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు మోకాలు లోతు నీరు ఉండడంతో వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. వీటి ని సరిచేసి క్రమబద్ధం చేయడానికి జీవీఎంసీ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కా రం చూడాలని వర్షం కురిసిన ప్రతిసారీ బితు కుబితుకుమంటూ గడుపుతున్నారు. తగరపువలస గ్రామంలోకి వచ్చే వాహనాలు గ్రామం నుంచి జాతీయ రహదారికి చేరవలసిన వాహనాలు తప్పనిసరిగా సర్వీసురోడ్డునే వినియోగించవలసి వస్తోంది. సిటీ బస్సు లు కూడా సర్వీసురోడ్డులోనే వస్తుంటాయి. అసలే ఇరుగ్గా ఉన్న ఈ రోడ్డులో నీరు నిల్వ ఉండిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందు లు పడుతున్నారు. అధికారులు ఆదివారం సాయంత్రం నాటికి కొంతమేర మట్టి, బురదను తొలగించారు.

రెడ్ అలర్ట్



కనకమహాలక్ష్మి ఆలయ సమీపంలోని రహదారిపై చేరిన నీరు

... 5వ పేజీ తరువాయి

మధురవాడ ప్రాంతాల్లో అధిక వర్షం కురిసింది. భారీ నుంచి అతిభారీ వర్షాలకు నగరం, శివారు ప్రాంతాల్లో గెడ్డలు, వాగులు, మురుగుకాల్వలు పొంగాయి. చెరువులకు నీరు వచ్చి చేరింది. నగరంలోని రైల్వేన్యూకాలనీ, పూర్ణామార్కెట్ పరిసరాలు, వన్‌టౌన్‌లో కొన్ని ప్రాంతాలు, అల్లిపురం, జ్ఞానాపురం ఇతర లోతట్టు ప్రాంతాల్లోకి నీరు ప్రవేశించింది. పూర్ణామార్కెట్ ,వెలంపేట, కల్లుపాకలు, రామకృష్ణా జంక్షన్, మునిసిపల్ స్టేడియం, అల్లిపురం, కొబ్బరితోట ప్రాంతాల్లో రోడ్లపై నీరు ప్రవహించి, ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రైల్వేస్టేషన్ రోడ్డులోని బ్రిడ్జి కింద వరద ప్రవహించడంతో వాహన రాకపోకలు చాలాసేపు నిలిచిపోయాయి. బీచ్‌రోడ్డు నీట మునిగింది. ఏయూ మైదానం నుంచి ఎర్రటి బురద వచ్చి చేరింది. నగరంలో పలుచోట్ల కొండ వాలు ప్రాంతాలు తడిసి ముద్దవడంతో కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అల్పపీడనం ప్రభావంతో తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లరాదని తుఫాన్ హెచ్చరిక కేంద్రం హెచ్చరించింది. విశాఖపట్నం, గంగవరం పోర్టులో మూడో నంబరు భద్రతా సూచిక ఎగురవేయగా, భీమిలి ఓడరేవుకు సమాచారం అందించారు.

స్త్రీశక్తికి అనూహ్య స్పందన

... 5వ పేజీ తరువాయి

టెక్కలి, సోంపేట, పాతపట్నం అదనపు సర్వీసులు నడిపారు. విజయనగరం, బొబ్బిలి సాలూరు, రాజాం, పార్వతీపురం ప్రాంతాలకు నాలుగు అదనపు సర్వీసులు ఆపరేట్ చేశారు.

సూపర్‌లగ్జరీ, అల్ట్రాడీలక్స్‌లకు రద్దీ

స్త్రీశక్తి బస్సుల రద్దీ ప్రభావం సూపర్‌లగ్జరీ, అల్ట్రాడీలక్స్ బస్సులపై పడింది. విజయవాడ, కాకినాడ, రాజమండ్రి శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాలకు వివిధ బస్సుల్లో మహిళలు, పురుషులు ప్రయాణించేవారు. ప్రస్తుతం మహిళలంతా ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రాపల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రోఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు ఆసక్తి చూపారు. దీంతో ఈ బస్సుల్లో వెళ్లాల్సిన కొందరు ప్రయాణికులో ప్రత్యామ్నాయంగా డీలక్స్, అల్ట్రాడీలక్స్, మెట్రోలగ్జరీ, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లో ప్రయాణించాల్సి వచ్చింది.

సీసీ కెమెరాలతో మోనటరింగ్

ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఆర్టీసీ అధికారులు మద్దిలపాలెం, ద్వారకా బస్‌స్టేషన్‌లోని సీసీ కెమెరాలను వినియోగించుకున్నారు. ఏప్లాటుఫారం మీద ఎంతట్రాఫిక్ ఉందో గుర్తించి బస్సులు సమకూర్చారు. ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ద్వారకా బస్‌స్టేషన్‌లో ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు.

టీచర్లకూ పరీక్షే!

... 5వ పేజీ తరువాయి

వచ్చిందని, గత 20 ఏళ్లుగా పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రశ్నపత్రాలు తయారుచేసే సీనియర్ టీచర్ ఒకరు వ్యాఖ్యానించారు. తొమ్మిది, పదోతరగతి విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రాలు యథావిధిగా ఉన్నాయని, ఒకటి నుంచి ఎనిమిదోతరగతి విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రాలతోనే తంటా వచ్చిందని మరో టీచర్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఒకటోతరగతిలో చేరే పిల్లలు ఇప్పుడిప్పుడే పాఠశాలలకు అలవాటుపడుతున్నారు. కొందరు ఆంగ్లం, తెలుగు అక్షరాలు గుర్తుపట్టడంలేదు. వారికి ఇంగ్లీష్‌లో పేరాగ్రాఫ్ ఇచ్చి దానికి ఇంగ్లీష్‌లోనే జవాబులు రాయాలని ప్రశ్నపత్రం ఇచ్చారు. మూడోతరగతి విద్యార్థులకు తెలుగులో పుస్తక సమీక్షచేసి దానిని విశ్లేషణ చేయాలి.. అప్పుడే మార్కులు వేయాలని నిబంధన పెట్టారు. మూడో తరగతి ఆంగ్ల పరీక్షకు నాలుగో తరగతిలోని పాఠాల నుంచి ప్రశ్నలు ఇచ్చారు. గత విధానాన్ని మార్చి బుక్‌లెట్‌లు సరఫరా చేయడంతో వాటిని మూల్యాంకనం చేసేందుకు టీచర్లు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గోనె సంచుల్లో వాటిని కట్టలుగా కట్టి, ఇంటికి తీసుకువెళ్లి పని పూర్తిచేయాల్సిన పరిస్థితి నెలకొంది.

అనాలోచిత నిర్ణయాలు

ప్రశ్నపత్రాలు రూపొందించే ముందు విద్యార్థుల ప్రతిభ, సామర్థ్యం అంచనావేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎస్‌సీఈఆర్టీ విభాగం నిర్వాకంతోనే ఎఫ్ఏ పరీక్షలు విమర్శలకు తావిచ్చిందని టీచర్లు వ్యాఖ్యానిస్తున్నారు. గత ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించిన అధికారులు చాలా వరకు పాఠశాల విద్యాశాఖలో తిష్ట వేసి చక్రం తిప్పుతున్నారని, వారి ప్రయోగాలతో కూటమి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెడుతున్నారని విమర్శించారు. 'హోటల్ యజమాని మారినా, వంటవాడు అక్కడే ఉండడంతో మంచి వంటకం' ఎలా సాధ్యమని వ్యంగ్యంగా ప్రశ్నిస్తున్నారు.

డిగ్రీ ప్రవేశాలకు ఎదురుచూపులు

... 5వ పేజీ తరువాయి

విద్యార్థులు మాత్రమే డిగ్రీ కోర్సుల వైపు ఆసక్తి చూపిస్తున్నారు. ఇంజనీరింగ్ కాలేజీలకు ఇష్టం వచ్చినట్టు సెక్షన్స్ పెంచుకునేందుకు అనుమతించడం, డిగ్రీ అడ్మిషన్స్‌కు సకాలంలో షెడ్యూల్ విడుదల చేయకపోవడం, డిగ్రీ తరువాత పీజీ కోర్సులు చేసేందుకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వర్తింపజేయకపో వడం వంటి కారణాలతో డిగ్రీ కోర్సులకు డిమాండ్ తగ్గుతోందని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. కర్నుడి చావుకు వంద కారణాలన్న చందంగా. .డిగ్రీ కాలేజీలు అంపశయ్యపైకి చేరుకునేందుకు అనేక అంశాలు దోహదం చేస్తున్నాయని ఎంవీపీ కాలనీలోని ఒక కాలేజీ ప్రిన్సిపాల్ నిట్టూర్చారు.

నత్తనడకన యూనిటీ మాల్ పనులు

... 5వ పేజీ తరువాయి

హస్తకళలు, చేనేత, ఇతర ఉత్పత్తులను ప్రోత్సహించి మార్కెటింగ్ చేయడానికి యూనిటీ మాల్ నిర్మాణానికి నడుం కట్టింది. వీటి ద్వారా డ్వాక్రా మహిళలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు లబ్ధి పొందుతారు. దేశంలో అన్ని రకాల కళలు, ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉంచుతారు. దీంతో పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది.

రిటైల్ మార్కెటింగ్‌కు అవకాశం

యూనిటీ మాల్‌లో 40 శాతం రిటైల్ మార్కెటింగ్ షాపులకు కేటాయిస్తారు. ప్రదర్శనలకు పెద్ద మందిరాలు నిర్మిస్తారు. శిక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. సాంస్కృతిక కళా ప్రదర్శనల కోసం వేదికలుంటాయి. రాష్ట్రంలో 26 జిల్లాలు ఉండగా ఒక్కో జిల్లాకు ఒక్కో స్టాల్ ఉంటుంది. అక్కడ ఆ జిల్లా ప్రత్యేకతను తెలిపే ఉత్పత్తులు, కళలు ఉంటాయి. ఉదాహరణకు అనకాపల్లి జిల్లానే తీసుకుంటే... ఏటికొప్పాక బొమ్మలు, బొజ్జన్నకొండ, అనకాపల్లి బెల్లం, మాడుగుల హల్వా ఇలా ఆ ప్రాంతం ప్రత్యేకతను తెలిపే ఉత్పత్తులు అందుబాటులో ఉంచుతారు. వాటిని ఆ ప్రాంతానికి చెందిన కళాకారులే విక్రయించుకుంటారు. వారి వ్యాపారానికి, ఉపాధికి ఇది పెద్ద వేదికగా నిలుస్తుంది. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా స్టాల్‌లో సేంద్రియ విధానంలో పండించిన వ్యవసాయ ఉత్పత్తులు ఉంచుతారు. కేంద్ర సహాయ మంత్రి ప్రకటించినట్టు దీనిని ఏడు నెలల్లో పూర్తి చేయాలంటే యుద్ధ ప్రాతిపదికన, వందలాది మందితో పనులు చేపట్టాల్సి ఉంది. కానీ ఇక్కడ ఆ పరిస్థితి కనిపించడం లేదు. పర్యవేక్షణ బాధ్యతలను ప్రత్యేక అధికారికి అప్పగిస్తే తప్ప సకాలంలో పూర్తిచేయడం కష్టమనే వాదనలు వినిపిస్తున్నాయి.

బీచ్‌కు వచ్చిన పిల్లలు తల్లిదండ్రులకు అప్పగింత



పిల్లలను తల్లిదండ్రుల చెంతకు చేర్చిన మెరైన్ పోలీసులు, లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పోతినమల్లయ్యపాలెం ప్రాంతానికి చెందిన ఐదుగురు పిల్లలు ఆదివారం ఆటవిడుపుగా రుషికొండ బీచ్‌కు చేరుకున్నారు. వీరు బీచ్‌లో ఆడుకుని అనంతరం తిరిగి ఇంటికి వెళ్లేందుకు డబ్బులు లేకపోవడంతో ఎలా వెళ్లాలో తెలియక బిత్తరచూపులు చూస్తుండడం మెరైన్ పోలీసుల కంటపడింది. దీంతో పోలీసులు పిల్లల దగ్గరకు వెళ్లి ఆరా తీశారు. విషయాన్ని వారి తల్లిదండ్రులకు తెలియజేసి రప్పించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను వారికి అప్పగించారు.

వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి నిత్య కల్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకస్వాములు సంప్రదాయబద్ధంగా నిత్య కల్యాణం జరిపించారు.

కొత్తగాజువాకలో గ్యాస్ లీక్

... 5వ పేజీ తరువాయి

నింపుతుండగా ఒక్కసారిగా గ్యాస్‌లీకై మంటలు వ్యాపించడంతో అక్కడే ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. సిలిండర్‌లోకి గ్యాస్ నింపుతున్న సమయంలో శిరీష లైటర్ వెలిగించడంతోనే ప్రమాదం జరిగిందని నిర్వాహకుడు కృష్ణారావు చెబుతుండగా, కృష్ణారావు టెస్టింగ్ కోసం లైటర్ వెలిగించడమే కారణమని లక్ష్మి చెబుతోంది. అయితే ఆ సమయంలో అక్కడ మరోవ్యక్తి ఉన్నాడని, అతడు పరారవడంతో అసలు విషయం తెలియలేదని పోలీసులు తెలిపారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తే పూర్తివిషయాలు వెలుగుచూస్తాయని ఎస్ఐ రవికుమార్ తెలిపారు.ఈ సంఘటనకు సంబంధించి బాధ్యులపై గాజువాకశాంతి భద్రతల విభాగం పోలీసులతో పాటుపౌరసరఫరాల విభాగం అధికారులు వేర్వేరుగా కేసులు నమోదుచేశారు.

కుండపోత వర్షంతో స్తంభించిన జనజీవనం



మధురవాడ వంతెన వద్ద వరదనీరు



సీతకొండ వద్ద పడిన కొండచరియలు



కొమ్మాది జంక్షన్ జలమయం



సింహగిరి వద్ద వరదనీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ నరసింహం, జడ్పీ హేమలత



సాగర్‌నగర్ వద్ద సముద్రంలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కెరటాలు

మధురవాడ/కొమ్మాది/ఎండాడ/విశాలాక్షినగర్/సాగర్‌నగర్/సింహాచలం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచి కురిసిన కుండపోత వర్షానికి జనజీవనం స్తంభించింది. రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి.మధురవాడ కారుషెడ్ నుంచి కొమ్మాది కూడలి వరకు సర్వీసు రోడ్డులో నడుంలోతు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. రోడ్డుపక్కన నిలిపిన ద్విచక్రవాహనాలు వరదలో కొంత దూరం కొట్టుకుపోయాయి. మధురవాడ ఎత్తువంతెన వద్ద నీరు నిలి చిపోవడంతో వాహనాలు కదలలేకపోయాయి. శిల్పారామం ఎదురుగా ప్రజలు ఇబ్బందిపడ్డారు. సీతకొండ మలుపులో కొండచరియలు విరిగిపడ్డాయి. విశాలాక్షినగర్ బీచ్ రోడ్డు, తెన్నేటి పార్కు సమీపంలోని కొండలపై నుంచి బండరాళ్లు ఫుట్‌పాత్‌లపై పడినా ఎవరికీ ప్రమాదం వాటిల్లలేదు. కొమ్మాది కూడలి నుంచి పి.ఎం.పాలెం కార్‌షెడ్ వరకు కాలువలపై పలకలు తొలగించడంతో రోడ్లు జలమయమయ్యాయి. సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, రుషికొండ తదితర ప్రాంతాలలో భారీ వర్షాలు కురవడంతో సాగర్‌నగ్ శివాలయం దాటిన తరువాత 80 అడుగుల రహదారి చెరువును తలపిస్తోంది. వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. సాగర్‌నగర్‌కు ఉత్తరదిక్కున ప్రవహించే గెడ్డ ఉప్పొంగుతోంది. ప్రమాదం జరగకముందే జీవీఎంసీ యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడడంతో బీచ్‌కు వచ్చిన సందర్శకులు ఆందోళన చెందారు. సింహాచలం కొండపై నుంచి ఉధృతంగా ప్రవహించిన కొండవాలు గెడ్డ నుంచి వరదనీరు రహదారిపైకి పొంగి ప్రవహించింది. ప్రధాన రహదారిలోని పైడితల్లమ్మ అమ్మవారి ఆలయం ఎదురుగా ఉన్న షాపుల వెనుక భాగం నుంచి రహదారిపైకి వరద నీటితో పాటు రాళ్లు కొట్టుకుని రావడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. కొండవాగు నుంచి వచ్చే గెడ్డ నీరు కాలువల్లోకి చేరే మార్గం సక్రమంగా లేకపోవడంతో వరదనీరు రోడ్డుపైకి పొంగి ప్రవహించింది. దీంతో ఈ ప్రాంతంలో పర్యటించిన స్థానిక కార్పొరేటర్ పి.వి.నరసింహం, జడ్పీ హేమలత సిబ్బందిని అప్రమత్తం చేశారు. కొండగెడ్డ నుంచి వస్తున్న నీరు బీఆర్‌టీఎస్‌కు ఆనుకుని ఉన్న కాలువలోకి చేరేలా డెక్ట్‌లపై ఏర్పాటు చేసిన పలకల్ని సిబ్బంది తొలగించారు. దీంతో కాసేపటికి ఉధృతి తగ్గుముఖం పట్టింది. రహదారిపైకి చేరిన రాళ్లు, బురదను తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. పాత అడవివరంలోని సచివాలయం సమీపంలో బీఆర్‌టీఎస్‌పై వరదనీరు చేరి వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. కుమ్మరి దిబ్బ నుంచి అడవివరం వెళ్లే మార్గంలో మధ్యాహ్నం వరకూ వరదనీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కమనీయంగా స్వర్ణ పుష్పార్చన



స్వామివారికి స్వర్ణ పుష్పార్చన నిర్వహించిన దృశ్యం

సింహాచలం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానంలో స్వామివారికి 108 బంగారు పుష్పాలతో స్వర్ణపుష్పార్చన అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. దేవస్థాన వేదపండితులు వేదమంత్రాలు, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజు స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్ఠింపజేసి వేదమంత్రాలు నాదస్వర మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి స్వర్ణ పుష్పార్చన సేవ నిర్వహించారు. భక్తులు ప్రత్యక్షంగా ఆర్జిత సేవలో పాల్గొని తరించారు.

ముగిసిన శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు



సాగర్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో మూడు రోజులు ఘనంగా జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు నందోత్సవంతో ఆదివారం ముగిశాయి. ఇస్కాన్ సంస్థాపకుడు శ్రీలప్రభుపాదులు జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇస్కాన్ విశాఖపట్నం అధ్యక్షుడు సాంబదాసు, మాతాజీనితాయిసేవని శ్రీలప్రభుపాదులు చరితాన్ని, ఆయన కృష్ణతత్వాన్ని ప్రపంచవ్యాప్తం చేయడానికి చేసిన కృషిని వివరించారు. 4 వేల మంది భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

అలరించిన భక్తి గీతాలాపనలు



గీతాలాపన చేస్తున్న సంగీత విద్యాంసులు

సాగర్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్ బీచ్‌రోడ్డులో కొలువై ఉన్న శ్రీమొగధార్మ మహాలక్ష్మి పద్మాలయంలో ఆదివారం రాగామ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో భక్తిగీతాలాపన కార్యక్రమం జరిగింది. కె.నాగజ్యోతి సారథ్యంలో గీతాలాపనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీమహాలక్ష్మి అమ్మవారి పాటలు, శ్రీకృష్ణుని గీతాలు భక్తులను ఆధ్యాత్మికంలో ఓలలాడించాయి.

కుండపోత వర్షం.. రహదారులు జలమయం

- ఎడతెరపి లేని వర్షంతో పలు ప్రాంతాల్లో ముంచెత్తిన వరద
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- లోతట్టు ప్రాంతాల్లో అవస్థలు


లక్ష్మీనరసింహానగర్ కొండవాలు ప్రాంతంలో కూలిన గోడ

కుప్పకూలిన గోడ

వెంకోజీపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలో శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు 15వ వార్డు లక్ష్మీనరసింహానగర్ కొండవాలు ప్రాంతంలో రమణమ్మ (డోర్ నెం.19-267) ఇంటి దారి వద్ద రిటైనింగ్ వాల్ ఆదివారం కూలిపోయింది. దీంతో అక్కడున్న నివాసులు దారి లేక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఎదురైంది. ఇంటి ముందు నుంచి కాకుండా వెనుక దారి నుంచి వెళ్లే దుస్థితి నెలకొంది. ఈ సమస్యను పరిశీలించిన వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షులు బోను సూరిబాబు నివాసులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. వర్షాలు ఇంకా పడే అవకాశం ఉన్నప్పటికీ నివాసులను ఆందోళన చెందవద్దని, అత్యవసరమైతే సింహాద్రిపురం సామాజిక భవనంలో పునరావాసం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు తెలియజేయడంతో జీవీఎంసీ ఈఈ గంగాధర్, ఏఈ భాగ్యశ్రీ ఈ స్థలాన్ని పరిశీలించి తక్షణమే ఇక్కడ తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

చిత్తడిగా రహదారులు


ఎంవీపీ సర్కిల్ సమీపంలోని బస్టాప్ వద్ద పరిస్థితి..

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) :ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఈ ప్రాంతంలో రహదారులు జలమయమయ్యాయి. ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులో వర్షం కురిసిన సమయంలో మోకాళ్ల లోతు నీరునిలిచిపోయింది. వర్షంతగ్గిన అరగంట వరకూ అదే పరిస్థితి. సాయంత్రం ఎంవీపీ కాలనీలోని పలు కూడళ్లలో చిరువ్యాపారుల సందడి కనిపించలేదు. ఎంవీపీ సర్కిల్ బస్టాపు వద్ద మురుగునీరు నిలిచిపోయింది. కాలువలు, గెడ్డల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపోయాయి.

నారా లోకేశ్‌ను కలిసిన వాజీ చానల్ ఎండీ


గణపతినీడి శ్రీనివాసరావుకు పుస్తకాన్ని అందజేస్తున్న మంత్రి లోకేశ్

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను వాజీ చానల్ ఎండీ గణపతినీడి శ్రీనివాసరావు ఆదివారం విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా వారు ఉత్తరాంధ్రలోని రాజకీయ, పాలనాపరమైన అంశాలపై చర్చించారు. ఉత్తరాంధ్రలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను, ముఖ్యంగా విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం జిల్లాల్లో కూటమి ప్రభుత్వ పాలన తీరును ఆయన లోకేశ్‌కు వివరించారు. యువగళం పాదయాత్ర అనుభవాలతో కూడిన పుస్తకాన్ని మంత్రి నారా లోకేశ్ గణపతినీడి శ్రీనివాసరావుకు బహూకరించారు.

ఆందోళన వద్దు.. తక్షణమే ఆదుకుంటాం

మేయర్ పీలా శ్రీనివాసరావు

భారీ వర్షాల నేపథ్యంలో పలు వార్డుల్లో విస్తృత పర్యటన


అధికారులకు సూచనలిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

వెంకోజీపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఆందోళన చెందవద్దని భారీ వర్షాలు, వరదలు, గాలివానలు, వడగళ్ల వాన వంటి సహజ విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు జీవీఎంసీ తక్షణ చర్యలు చేపట్టేందుకు సంసిద్ధంగా ఉందని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. నగరంలో భారీ వర్షాల నేపథ్యంలో ఆదివారం మేయర్ పలు వార్డుల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ, అమరావతి వాతావరణ కేంద్రం సమాచారం మేరకు రాష్ట్రంలో వర్షాలు అధికంగా కురుస్తున్నాయని, విశాఖ నగరంలో కూడా భారీ వర్షాలు కురుస్తున్నందున ఇప్పటికే జీవీఎంసీ అప్రమత్తంతో ముందస్తుగా ప్రత్యేక చర్యలను చేపట్టిందన్నారు. కొండవాలు, లోతట్టు, మురికివాడ ప్రాంతాల ప్రజలకు రక్షణ కల్పించే దిశగా శిథిలావస్థలోనున్న భవనాలను గుర్తించి నగరంలో గల పటిష్ఠమైన సామాజిక భవనాలు, పాఠశాల భవనాలను అత్యవసర ఆశ్రయాలుగా సిద్ధం చేయడం జరిగిందన్నారు. జీవీఎంసీ అధికారులు ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఏర్పడిన సమస్యలను పరిష్కరిస్తున్నారని, నగరంలో డ్రైనేజీ లైన్లు, మ్యాన్‌హోల్స్ అధికంగా నీరు పారే ప్రదేశాలను గుర్తించి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవడమైనదన్నారు. తాగు నీటి సరఫరాలో అంతరాయం లేకుండా వర్షాల కారణంగా దెబ్బతిన్న వీధి దీపాలను వెంటనే మరమ్మతు చేయడం కూలిన, విరిగిపడిన చెట్లను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టడమైనదని మేయర్ తెలిపారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవించినట్టయితే ప్రజల రక్షణ దిశగా జీవీఎంసీ రీజనల్ అగ్నిమాపక అధికారి తగు చర్యలు చేపడుతున్నారని, అత్యవసర పరిస్థితుల్లో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో అవసరమగు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించామన్నారు. అత్యవసర సహాయ కేంద్రంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల సిటీ ఆపరేషన్స్ సెంటర్ నందు జీవీఎంసీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ప్రజలు ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే జీవీఎంసీ కంట్రోల్ రూమ్‌లో గల టోల్ ఫ్రీ నెంబర్ 180042500009కు ప్రజలు సమాచారం అందించాలని సూచించారు.

అలాగే జోనల్ కార్యాలయాల్లో కూడా సంప్రదించవచ్చన్నారు.జీవీఎంసీ ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో ప్రజలకు తక్షణ సహాయం అందిస్తారని తెలిపారు.

వరదలో రోడ్లు, పార్కులు


ముడసర్లోవ రిజర్వాయరుకు ఎగువ నుంచి వస్తున్న వరద నీరు

ఆరిలోవ. ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. ఏకదాటిగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొర్లిపొంగాయి. ఎగువ భాగం నుంచి పైనాపిల్ కాలనీ, రామకృష్ణాపురం మీదుగా ముడసర్లోవ రిజర్వాయర్ వచ్చే గెడ్డ నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అక్కడ ఉన్న పరిసరాలు చెరువులను తలపిస్తున్నాయి. గతంలో ఈ వరద నీరు రామకృష్ణాపురం గ్రామంలోకి వచ్చి గ్రామాన్ని ముంచివేసేది. జీవీఎంసీ అధికారులు శాశ్వత పరిష్కారం చూపేలా గోడలు నిర్మాణం చేపట్టడంతో వరద నీరు ఈ గ్రామం రాకుండా పోతోంది. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెదగదిలి జంక్షన్‌లో వరద నీరు రావడంతో వాహనాల రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ఈ ప్రాంతమంతా చిన్న పాటి చెరువులా తలపించింది. అలాగే పెదగదిలిలో నిర్మించిన చిన్న పిల్లల పార్కులో వర్షం నీరుతో నిండి పోయింది. దీనివల్ల ఈ పార్కు చిన్న పాటి తటాకంలా కనిపిస్తోంది. అలాగే ఇటీవల సాలిపేటలో నిర్మించిన చిన్న పిల్లల క్రీడా పార్కు కూడా వరద నీటితో నిండిపోయింది.


వరద నిండిన పెదగదిలిలోని చిన్నారుల క్రీడా పార్కు

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు


శ్రీకృష్ణుని దర్శించుకుంటున్న వెలగపూడి ప్రతాప్‌రుద్ర


పూజలు అందుకుంటున్న రాధాకృష్ణులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : హరే కృష్ణమూవ్‌మెంట్ ఆధ్వర్యంలతో ఎంవీపీ కాలనీ గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు మూడవ రోజైన ఆదివారంతో ముగిశాయి. నందోత్సవం, వ్యాసపూజ నిర్వహించారు. ఆదివారం వచ్చిన వేలాది మంది భక్తజనానికి బృందావన వాసులకు విందు ఏర్పాటుచేసినట్లుగా వివిధ రకాల వంటకాలతో ఆహారం అందించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ వ్యవస్థాపక ఆచార్య భక్తి వేదాంతస్వామి ఆవిర్భావదినోత్సం సందర్భంగా వెయ్యి రకాల వంటకాలతో నైవైద్యం ఏర్పాటుచేశారు. ఉదయంనుంచి హరిత సిస్టర్స్ సంగీత సేవ, శారదాసుబ్రహ్మణ్యం విద్యార్థుల బృందం, చైతన్య బ్రదర్స్ వివిధ సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి, భక్తులను ఆధ్యాత్మిక పారవశ్యంలో తేలియాడించారు. భక్తులు 108 సార్లు హరినామ జపం చేశారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు తనయుడు ప్రతాప్‌రుద్ర స్వామిని దర్శించుకున్నారు. సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ ఆలయం పూజల్లో కూడా ఆయన పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **వార్-2 :** జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ :** సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్ :** మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ :** లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా48, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 22, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 24,బీరకాయలు 18, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 18, క్యారెట్ 46, దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు(కిలో) 26, అల్లం (పాతది) 70, బరబాటి 28, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 64, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 30, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండుసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోట కూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

27 నుంచి సంపత్‌వినాయగర్ మహోత్సవాలు


సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న దృశ్యం

సిరిపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : సంపత్ వినాయగర్ ఆలయంలో వినాయక చవితి మహోత్సవాలు ఈ నెల 27 నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు. ఈ నేపథ్యంలోని ఆదివారం వినాయక నవరాత్రుల తొలి ఆహ్వాన శుభలేఖను సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణకు అందజేశారు.

ట్రాఫిక్ పోలీసుపై సీపీకి కూరగాయల రైతు ఫిర్యాదు

భీమునిపట్నం (రూరల్) ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : భీమిలి రూరల్ కల్లివానిపాలెం గ్రామానికి చెందిన ఉప్పాడ అప్పలరెడ్డి అనే కూరగాయల రైతు పట్ల మధురవాడ ట్రాఫిక్ కానిస్టేబుల్ నాయుడు అనుచితంగా ప్రవర్తించారని పోలీసులకు ఫిర్యాదు అందింది. తోటకూర ఇతర కూరగాయలను తీసుకుని మధురవాడలో రోడ్డు పక్కన అమ్ముతుండగా ఆదివారం ఉదయం ఆ ప్రాంతంలో ట్రాఫిక్ విధులను నిర్వహిస్తున్న నాయుడు అనే కానిస్టేబుల్ అనుచితంగా ప్రవర్తించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించారని రైతు అప్పలరెడ్డిఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను ఫుట్‌పాత్ వెనుక కూరగాయలను పెట్టుకుని అమ్ముతుండగా, తన ముందు గొడుగులు వేసుకుని అమ్ముతున్న వారిని కానీ, పార్కింగ్ కానీ స్థలంలో ఉంచిన వాహనాల వారిని ఏమీ అనకుండా కొత్తగా తాను వచ్చానని తనపై అనుచితంగా ప్రవర్తించారని అన్నారు. దీంతో తాను తీసుకొచ్చిన తోటకూర 15 కిలోలు విక్రయించలేకపోయాయని అప్పలరెడ్డి ఆవేదనవ్యక్తం చేశారు. ఈ విషయమై కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్టు బాధిత రైతు అప్పలరెడ్డి పేర్కొన్నారు.

వినాయక చవితి వేడుకలకు పందిరి రాట


18వ వార్డులో పందిరిరాటలో పాల్గొన్న కార్పొరేటర్ మంగవేణి, టీడీపీ యువనేత ప్రతాప్‌రుద్ర

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పలు వీధులు కాలనీల్లో వినాయకచవితి సందడి మొదలైంది. ఆయా కాలనీల సంఘాలు, యువత ఆధ్వర్యంలో చవితి ఉత్సవాలకు పందిరి రాట ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఎంవీపీ కాలనీ ధర్మశక్తినగర్‌లోని షిర్డీసాయి పార్కులో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పందిరి రాటను ఆదివారం వేశారు. కాలనీవాసులు పాల్గొన్నారు. జీవీఎంసీ 18వ వార్డులోని ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరులో నిర్వహించిన రాట మహోత్సవంలో కార్పొరేటర్ గొలగాని మంగవేణిపోలారావు, వెలగపూడి ప్రతాప్‌రుద్ర పాల్గొన్నారు. పెదజాలారిపేట, అప్పుఘర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన రాటఉత్సవాల్లోయువతపాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : చినగదిలిలోని నేతాజీనగర్‌లో గల మహవీర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వినాయక మహోత్సవాలకు ఆదివారం ఉదుపురాటను వేశారు. ఈ నెల 27న జరగనున్న వరసిద్ధి వినాయక పూజలను భారీ ఎత్తున నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు పోతిన భరత్ తెలిపారు. సుమారు 21 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రాయిన సాయి, కొండల గణేష్, మౌర్య సంతోష్,, నవీన్ ఎల్లాజీ, వివేక్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఎంవీపీ కాలనీ ధర్మశక్తినగర్ శిర్డీసాయి పార్కులో పందిరి రాటలో పాల్గొన్న కాలనీవాసులు


ఆరిలోవలోని నేతాజీ నగర్‌లో పందిరి రాట ఉత్సవంలో పాల్గొన్న మహవీర్ యూత్ ప్రతినిధులు

వార్డు సెక్రటరీల సమస్యల పరిష్కారానికి వినతి

రామ్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయ వార్డు సెక్రటరీల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీజే గణేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వ్యక్తిగత కార్యదర్శి ఎమ్.వీవీ ఉదయభాస్కర్ విశాఖ పర్యటనలో భాగంగా జీవీఎంసీ కార్యాలయానికి వచ్చిన ఆయనను అసోసియేషన్ సభ్యులు కలిసి వినతి పత్రాన్ని అందించారు ఈ కార్యక్రమంలోలో విశాఖ జిల్లా నాయకులు బీవీ అశోక్‌కుమార్, ఇపవన్ తదితులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

- రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా నిలవాలి
- కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి పిలుపు
- బీచ్ రోడ్డులో కాంగ్రెస్ పార్టీ కాగడాల ర్యాలీ



కాగడాల ర్యాలీలో పాల్గొన్న మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి, ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మ, కాంగ్రెస్ నగర నేత వి.శ్రీనివాస్ తదితరులు

బీచ్ రోడ్డు, ఆగస్టు 17, (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కాంగ్రెస్ పార్టీ మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి పేర్కొన్నారు. వన్ మ్యాన్ - వన్ ఓట్, సేవ్ డెమోక్రసీ, సేవ్ రాజ్యాంగం పేరుతో బీచ్ రోడ్డులోని ఆర్కే బీచ్ నుంచి సబ్ మెరైన్ వరకు ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టార్చ్ ర్యాలీ(కాగడాల ప్రదర్శన) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు చోరీపై తాడోపేడో తేల్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఉద్యమ స్థాయిలో విజృంభించేందుకు సిద్ధమైందన్నారు. త్వరలో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ), అలాగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరిట 65 లక్షల ఓట్లను తొలగించడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ 'ఓటు అధికార్' పేరుతో యాత్ర చేపడుతున్నారని తెలిపారు. ఈ యాత్ర బిహార్‌లో సెప్టెంబర్ 1 నుంచి 16 రోజులపాటు 20 జిల్లాల్లో యాత్ర కొనసాగుతుందని వెల్లడించారు. ఈ యాత్ర భారత ప్రజాస్వామ్య చరిత్రలో అతి పెద్ద మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఓటును దొంగలించడమే కాదు, ప్రజల గుర్తింపును కూడా దొంగలిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వజ్జపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓట్ చోరీతో బీజేపీ ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడుతోందన్నారు. ఈ తరహా ఎన్నికల ప్రక్రియతో వ్యవస్థలను నాశనం చేసేందుకు బీజేపీ పూనుకుంటోందన్నారు. ప్రజాస్వామ్యవాదులంతా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ఆర్కే బీచ్ కాళికామాత దేవాలయం నుంచి వైఎంసీఏ జంక్షన్ వరకు కాగడాలతో 'మన ఓటు.. మన హక్కు' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నగర మాజీ అధ్యక్షుడు వి.శ్రీనివాస్, విజయనగరం మాజీ డీసీసీ ప్రెసిడెంట్ పి.పరమేశ్వరరావు, శ్రీరాములు, మహిళలు పాల్గొన్నారు.

బీజేపీ, ఈసీ అరాచకాలకు అడ్డుకట్ట వేయాలి

- కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):గత లోక్‌సభ ఎన్నికల్లో అనేకచోట్ల ఈసీతో కలిసి బీజేపీ చీటింగ్‌కు పాల్పడిందని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు ఆరోపించారు. ఆదివారం ఉదయం నగర పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ సెంట్రల్ నియోజకవర్గంలో జరిగిన ఓట్ చోరీ వ్యవహారంపై రాహుల్‌గాంధీ ఆధారాలతో సహ వివరాలను వెల్లడించారని, ఒకే ఇంట్లో 80కు పైగా ఓట్లు ఉన్నట్టు చూపించారని పేర్కొన్నారు. ఇటువంటి అనేక ఆ నియోజకవర్గంలో జరిగినట్టు రాహుల్‌గాంధీ వివరించారన్నారు. బీజేపీ, ఈసీ కలిసి చేస్తున్న అరాచకాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. స్టాప్ ఓట్ చోరీ పేరుతో రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా పెద్దఎత్తున క్యాంపైన్ ప్రారంభించారని, దీనిద్వారా ప్రజల్లో అవగాహన కలిగించే ప్రయత్నం చేస్తామని రుద్రరాజు పేర్కొన్నారు. అలాగే బిహార్‌లో లక్షల ఓట్లను డిలీట్ చేశారని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాహుల్‌గాంధీ 13 రోజులపాటు 1,600 కిలోమీటర్ల పాదయాత్రను బిహార్‌లో ప్రారంభించారన్నారు. ఈసీ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డాల వెంకట వర్మరాజు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ప్రారంభించిన ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ లక్కరాజు రామారావు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా బీజేపీ, ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తోందన్నారు. సమావేశంలో ఏపీసీసీ వైస్ ప్రెసిడెంట్ వేగి వెంకటేశ్, పలు నియోజకవర్గాల సమన్వయకర్తలు కేవీ సూర్యనారాయణ, దండి ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లా ఎన్జీవోఎస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవికుమార్



అగనంపూడి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉమ్మడి జిల్లా కమర్షియల్ ట్యాక్స్ ఎన్‌జీవోఎస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పీలా సూర్యనారాయణ (రవికుమార్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం లంకెలపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సభ్యులంతా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా జగదీశ్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాఘవేంద్ర, ట్రెజరర్‌గా బాల రవికిరణ్, ఉపాధ్యక్షులుగా అప్పలరాజు, రాజేశ్, సంయుక్త కార్యదర్శులుగా సుశీల, కుమార్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్య వర్గాన్ని సంఘం రాష్ట్రం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్ బాబు, సుధాకర్, సంఘం నాయకులు రత్నకుమార్, రమేశ్‌కుమార్, పురుషోత్తంనాయుడు, కటారి ఈశ్వరరావులు అభినందించారు.

రోగికి సురక్షిత ప్రాంతానికి తరలింపు



ఆరిలోవ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) భారీ వర్షాలకు పెదగదిలి శివాలయం ప్రాంతంలో గల గల కొండవాలు ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం ఇంటి గోడ కూలిపోయింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఆ ఇంట్లో సారిక పైడిరాజు (70) అనే రోగి అతని భార్య మారమ్మ, పిల్లలతో కలసి ఉన్నారు. స్థానికుల పైడిరాజును సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యటన

మహారాణిపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి సోమవారం విశాఖలో పర్యటించనున్నారు. ఉదయం గీతం యూనివర్సిటీకి వెళ్లి అక్కడ మధ్యాహ్నం వరకు 9 జిల్లాల సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం పరదేశీపాలెంలో కళాశాల విద్యార్థినుల హాస్టల్‌లో జర్మనీ వెళ్లే నర్సులతో ముఖాముఖి సమావేశమవుతారు. అనంతరం విజయవాడ వెళతారు.

పేలుడు ఘటనలో ఐదో వ్యక్తి మృతి

మహారాణిపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఫిషింగ్ హార్బర్ పేలుడు ఘటనలో చికిత్స పొందుతూ ఎల్లాజీ అనే మరో వ్యక్తి మృతి చెందాడు. ఇటీవల ఫిషింగ్ హార్బర్ సమీపంలోని ఒక వెల్డింగ్ షాపులో భారీ పేలుడు సంభవించటంతో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందగా, తీవ్ర గాయాలతో మరో ముగ్గురు కేజీహెచ్‌లో చేరారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి రంగారావు అనే వ్యక్తి, ఆదివారం ఉదయం ఎల్లాజీ అనే మరో వ్యక్తి మృతి చెందారు. దీనితో మృతులు ఐదుకి చేరారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఇంకో వ్యక్తి ఆరోగ్య పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు.

ఆకట్టుకున్న బాలు స్వరఝురి



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీగాయకులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బాలు స్వరఝురి సినీ సంగీత విభావరిని ఆద్యంతం ఆహూతులను ఓలలాడించింది. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలోని బాలు స్వరఝురి సంస్థ వ్యవస్థాపకులు లఖినేని బాలకృష్ణ ఆధ్వర్యంలో విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా లఖినేని బాలకృష్ణ మాట్లాడుతూ సంగీతంపై ప్రతీ ఒక్కరూ అవగాహన ఏర్పరచుకోవాలని సూచించారు. గాయనీ గాయకులు నీలు, పూర్ణ, ఎల్.బాలకృష్ణ, హెచ్.సుధాకర్, కె.కోటేశ్వరరావు, ఎ.ఎస్.వెంకట్రావు, జె.ఎస్.నివాస్, బి.రాజులు పలు సినీగీతాలను హృద్యంగా ఆలపించి ఆకట్టుకున్నారు. గాయని నీలు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నగరంలోని సంగీతప్రియులు పాల్గొన్నారు.

నందగిరినగర్‌లో అన్న సమారాధన


అన్నసమారాధన ప్రారంభిస్తున్న మోహన్

అక్కయ్యపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43వ వార్డు నందగిరినగర్‌లోని గోకుల కృష్ణ దేవాలయం ఆవరణలో కృష్ణాష్టమి సందర్భంగా ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి మోహనరావు హాజరయ్యారు. సోమవారం ఉదయం పూజ, సాయంత్ర ఉట్లు కొట్టే కార్యక్రమం ఉంటుందని మోహన్ తెలిపారు. గోకుల కృష్ణ స్వామిని ఊరేగిస్తామన్నారు.

'కల్యాణీ..రా.. ఉచిత బస్సు ఎక్కిస్తాం'

మహారాణిపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు ప్రయాణ పథకంతో మహిళలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఎస్.అనంతలక్ష్మి అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణిని ఆహ్వానిస్తున్నామని, ఆమె వస్తే స్త్రీశక్తి పథకం కింద కేటాయించిన ఐదు కేటగిరీల బస్సులలో తమతో పాటు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. లేకుంటే విమర్శలు మానుకోవాలని సూచించారు. వరుదు కల్యాణి ఆ పార్టీలో ఎంత నష్టపోయారో అందరికీ తెలుసునని వ్యంగ్యంగా అన్నారు. ఆమె మాటలు వెనక్కి తీసుకుని, ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కొత్తగాజువాకలో గ్యాస్ లీక్

... 5వ పేజీ తరువాయి

నింపుతుండగా ఒక్కసారిగా గ్యాస్‌లీకై మంటలు వ్యాపించడంతో అక్కడే ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. సిలిండర్‌లోకి గ్యాస్ నింపుతున్న సమయంలో శిరీష లైటర్ వెలిగించడంతోనే ప్రమాదం జరిగిందని నిర్వాహకుడు కృష్ణారావు చెబుతుండగా, కృష్ణారావు టెస్టింగ్ కోసం లైటర్ వెలిగించడమే కారణమని లక్ష్మి చెబుతోంది. అయితే ఆ సమయంలో అక్కడ మరోవ్యక్తి ఉన్నాడని, అతడు పరారవడంతో అసలు విషయం తెలియలేదని పోలీసులు తెలిపారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తే పూర్తి విషయాలు వెలుగుచూస్తాయని ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి బాధ్యులపై గాజువాక శాంతి భద్రతల విభాగం పోలీసులతో పాటు పౌరసరఫరాల విభాగం అధికారులు వేర్వేరుగా కేసులు నమోదుచేశారు.

భారీ వర్షంతో చెరువులను తలపించిన రోడ్లు

» కూలిపోయిన భారీ వృక్షం » కమిషనర్ ఆదేశాలతో సహాయక చర్యలు » ఎర్రిగెడ్డ పూడిక పనులు పరిశీలించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ


జ్ఞానాపురం వీధిలో చేరిన నీరు


వర్షపు నీరు నిలిచిన సీతమ్మధార ప్రధాన రహదారి


ఎర్రిగెడ్డపూడిక పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

జ్ఞానాపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలో శనివారం అర్ధరాత్రి, ఆదివారం రోజంతా భారీ వర్షం కురవడంతో రహదారులపై నీళ్లు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం కలిగింది. జ్ఞానాపురం ప్రాంతంలోని సెబాస్టియన్ కాలనీ, చర్చ్ రోడ్లు చెరువులను తలపించాయి. .స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కూటమి నేతలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా అధికారులను అప్రమత్తం చేశారు. ఎర్రిగెడ్డ పరిశీలించిన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ .సత్వరమే పూడిక తీత పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు.చావుల మదుం వద్ద నాలుగు అడుగుల మేర నీరు నిలిచిపోవడంతో .రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కూటమి నాయకులు ఐతి మధుబాబు, అంతోని శేఖర్, వైసీపీ అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్‌లు సహాయకచర్యలు చేపట్టారు.

ఇల్లు స్లాబ్ కూలి గాయాలు

స్థానిక 34వ వార్డు కొబ్బరితోట ఎస్సీ కాలనీ పరిధిలో శనివారం అర్ధరాత్రి భారీ వర్షం కారణంగా ఓ ఇల్లు స్లాబ్‌కూలిపోయింది. స్వామి అనే వ్యక్తి గాయపడ్డాడు. ఇంట్లో ఉన్న 80 సంవత్సరాల వయసున్న సింహాచలంకు అదృష్టవశాత్తూ ప్రాణాపాయం తప్పింది. గృహోపకరణాలు ధ్వంసమయ్యాయి. అధికారులు వెంటనే బాధిత కుటుంబానికి సహాయ సహకారాలు అందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


టీఎస్సార్ కాంప్లెక్స్‌లో కూలిపోయిన భారీ వక్షం

ఎర్రిగెడ్డ పూడికతీత పనులు ప్రారంభించాలి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఎర్రిగెడ్డ పూడిక పనులపై జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహించి వ్యర్థాలను వెలికితీసే పనులను పర్యవేక్షించారు. గెడ్డలో ఉన్న మూడు స్క్రీన్‌ల పనితీరును పరిశీలించి వాటి మధ్య ఎక్కువగా ఖాళీలు ఉన్నందున ఎం.ఎస్. స్క్రీన్‌లు ఏర్పాటు చేయాలని వర్షాలకు అనుగుణంగా సిబ్బందికి విధులు అప్పగించి నిరంతరం పర్యవేక్షించాలని పర్యవేక్షక ఇంజనీరు సంపత్ కుమార్‌ను ఆదేశించారు.

కూలిపోయిన భారీ వృక్షం

డాబాగార్డెన్స్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని టీఎస్సార్ కాంప్లెక్స్ సైడ్ ప్రాంతంలోని భారీ వర్షాలకు వృక్షం కూలిపోయింది. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని, ప్రజలు ఎవరూ లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. కూలిన వృక్షాన్ని ఆదివారం జేసీబీలతో తొలగించి, దుంగలుగా చేశారు. హార్టికల్చర్ డీఈ వీరరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎంకే రెడ్డిలు దగ్గరుండి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకున్నారు.

వర్షంతో మునిగిన రోడ్లు, డ్రైనేజీలు

సీతమ్మధార, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పలు రోడ్లు వర్షపు నీటిలో మునిగాయి. సీతమ్మధార ప్రధాన రహదారి ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వద్ద వర్షపు నీరు రోడ్డుపై నిలిచింది. నక్కవానిపాలెంలోని పలు ప్రాంతాల్లో మురుగు కాలువ గెడ్డలు పొంగిపొర్లాయి. దీంతో రోడ్డుపై మురుగు పారింది. సీతమ్మధార టీపీటీ కాలనీలో రోడ్డు మధ్యలో తవ్వడంతో పాటు వర్షపు నీరుతో రోడ్డు అంతా మునిగింది. అటుగా ప్రయాణించేవారు ఇబ్బందులు పడ్డారు.


వర్షం కారణంగా కొనుగోలుదారులు లేక వెలవెలబోయిన సీతమ్మధార రైతు బజారు

రెడ్ అలర్ట్


కనకమహాలక్ష్మి ఆలయ సమీపంలోని రహదారిపై చేరిన నీరు

... 5వ పేజీ తరువాయి

మధురవాడ ప్రాంతాల్లో అధిక వర్షం కురిసింది. భారీ నుంచి అతిభారీ వర్షాలకు నగరం, శివారు ప్రాంతాల్లో గెడ్డలు, వాగులు, మురుగుకాల్వలు పొంగాయి. చెరువులకు నీరు వచ్చి చేరింది. నగరంలోని రైల్వేన్యూకాలనీ, పూర్ణామార్కెట్ పరిసరాలు, వన్‌టౌన్‌లో కొన్ని ప్రాంతాలు, అల్లిపురం, జ్ఞానాపురం ఇతర లోతట్టు ప్రాంతాల్లోకి నీరు ప్రవేశించింది. పూర్ణామార్కెట్ ,వెలంపేట, కల్లుపాకలు, రామకృష్ణా జంక్షన్, మునిసిపల్ స్టేడియం, అల్లిపురం, కొబ్బరితోట ప్రాంతాల్లో రోడ్లపై నీరు ప్రవహించి, ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రైల్వేస్టేషన్ రోడ్డులోని బ్రిడ్జి కింద వరద ప్రవహించడంతో వాహన రాకపోకలు చాలాసేపు నిలిచిపోయాయి. బీచ్‌రోడ్డు నీట మునిగింది. ఏయూ మైదానం నుంచి ఎర్రటి బురద వచ్చి చేరింది. నగరంలో పలుచోట్ల కొండ వాలు ప్రాంతాలు తడిసి ముద్దవడంతో కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అల్పపీడనం ప్రభావంతో తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లరాదని తుఫాన్ హెచ్చరిక కేంద్రం హెచ్చరించింది. విశాఖపట్నం, గంగవరం పోర్టులో మూడో నంబరు భద్రతా సూచిక ఎగురవేయగా, భీమిలి ఓడరేవుకు సమాచారం అందించారు.

ఎక్కడి నీరు అక్కడే!

అక్కయ్యపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల నుంచి కురుస్తున్న కుండపోత వర్షానికి వివిధ ప్రాంతాల్లోని గెడ్డలు, కాల్వలు పొంగి మురుగు నీరు రోడ్లపైకి వచ్చింది. దీంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లు సమాంతరంగా లేకుండా ఎగుడు దిగుడుగా ఉండడంతో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో ప్రతి ఒక్కరూ అవస్థలు పడ్డారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, ఎనభై అడుగుల రోడ్డు, దొండపర్తి, రైల్వే న్యూకాలనీ, తాటిచెట్లపాలెం, నరసింహనగర్, కైలాసపురం, సాలిగ్రామపురం ప్రాంతాల్లో రోడ్డుపై వర్షపు నీరు ఎటు వెళ్లకుండా అక్కడే నిలిచిపోయింది.

స్త్రీశక్తికి అనూహ్య స్పందన

... 5వ పేజీ తరువాయి

టెక్కలి, సోంపేట, పాతపట్నం అదనపు సర్వీసులు నడిపారు. విజయనగరం, బొబ్బిలి సాలూరు, రాజాం, పార్వతీపురం ప్రాంతాలకు నాలుగు అదనపు సర్వీసులు ఆపరేట్ చేశారు.

సూపర్‌లగ్జరీ, ఆల్ట్రాడీలక్స్‌లకు రద్దీ

స్త్రీశక్తి బస్సుల రద్దీ ప్రభావం సూపర్‌లగ్జరీ, ఆల్ట్రాడీలక్స్ బస్సులపై పడింది. విజయవాడ, కాకినాడ, రాజమండ్రి శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాలకు వివిధ బస్సుల్లో మహిళలు, పురుషులు ప్రయాణించేవారు. ప్రస్తుతం మహిళలంతా ఆర్డినరీ, పల్లెవెలుగు, ఆల్ట్రాపల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రోఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు ఆసక్తి చూపారు. దీంతో ఈ బస్సుల్లో వెళ్లాల్సిన కొందరు ప్రయాణికులో ప్రత్యామ్నాయంగా డీలక్స్, ఆల్ట్రాడీలక్స్, మెట్రోలగ్జరీ, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లో ప్రయాణించాల్సి వచ్చింది.

సీసీ కెమెరాలతో మోనటరింగ్

ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఆర్టీసీ అధికారులు మద్దిలపాలెం, ద్వారకాబస్‌స్టేషన్‌లోని సీసీ కెమెరాలను వినియోగించుకున్నారు. ఏప్లాటుఫారం మీద ఎంతట్రాఫిక్ ఉందో గుర్తించి బస్సులు సమకూర్చారు. ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ద్వారకా బస్‌స్టేషన్‌లో ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు.

టీచర్లకూ పరీక్షే!

... 5వ పేజీ తరువాయి

వచ్చిందని, గత 20 ఏళ్లుగా పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రశ్నపత్రాలు తయారుచేసే సీనియర్ టీచర్ ఒకరు వ్యాఖ్యానించారు. తొమ్మిది, పదోతరగతి విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రాలు యథావిధిగా ఉన్నాయని, ఒకటి నుంచి ఎనిమిదోతరగతి విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రాలతోనే తంటా వచ్చిందని మరో టీచర్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఒకటోతరగతిలో చేరే పిల్లలు ఇప్పుడిప్పుడే పాఠశాలలకు అలవాటుపడుతున్నారు. కొందరు ఆంగ్లం, తెలుగు అక్షరాలు గుర్తుపట్టడంలేదు. వారికి ఇంగ్లీష్‌లో పేరాగ్రాఫ్ ఇచ్చి దానికి ఇంగ్లీష్‌లోనే జవాబులు రాయాలని ప్రశ్నపత్రం ఇచ్చారు. మూడోతరగతి విద్యార్థులకు తెలుగులో పుస్తక సమీక్షచేసి దానిని విశ్లేషణ చేయాలి.. అప్పుడే మార్కులు వేయాలని నిబంధన పెట్టారు. మూడో తరగతి ఆంగ్ల పరీక్షకు నాలుగో తరగతిలోని పాఠాల నుంచి ప్రశ్నలు ఇచ్చారు. గత విధానాన్ని మార్చి బుక్‌లెట్‌లు సరఫరా చేయడంతో వాటిని మూల్యాంకనం చేసేందుకు టీచర్లు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గోనె సంచుల్లో వాటిని కట్టలుగా కట్టి, ఇంటికి తీసుకువెళ్లి పని పూర్తిచేయాల్సిన పరిస్థితి నెలకొంది.

అనాలోచిత నిర్ణయాలు

ప్రశ్నపత్రాలు రూపొందించే ముందు విద్యార్థుల ప్రతిభ, సామర్థ్యం అంచనావేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎస్‌సీఈఆర్టీ విభాగం నిర్వాకంతోనే ఎఫ్ఏ పరీక్షలు విమర్శలకు తావిచ్చిందని టీచర్లు వ్యాఖ్యానిస్తున్నారు. గత ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించిన అధికారులు చాలా వరకు పాఠశాల విద్యాశాఖలో తిష్ట వేసి చక్రం తిప్పుతున్నారని, వారి ప్రయోగాలతో కూటమి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెడుతున్నారని విమర్శించారు. 'హోటల్ యజమాని మారినా, వంటవాడు అక్కడే ఉండడంతో మంచి వంటకం' ఎలా సాధ్యమని వ్యంగ్యంగా ప్రశ్నిస్తున్నారు.

డిగ్రీ ప్రవేశాలకు ఎదురుచూపులు

... 5వ పేజీ తరువాయి

విద్యార్థులు మాత్రమే డిగ్రీ కోర్సుల వైపు ఆసక్తి చూపిస్తున్నారు. ఇంజనీరింగ్ కాలేజీలకు ఇష్టం వచ్చినట్టు సెక్షన్స్ పెంచుకునేందుకు అనుమతిం చడం, డిగ్రీ అడ్మిషన్స్‌కు సకాలంలో షెడ్యూల్ విడుదల చేయకపోవడం, డిగ్రీ తరువాత పీజీ కోర్సులు చేసేందుకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వర్తింపజేయకపో వడం వంటి కారణాలతో డిగ్రీ కోర్సులకు డిమాండ్ తగ్గుతోందని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. కర్ణుడి చావుకు వంద కారణాలన్న చందంగా. .డిగ్రీ కాలేజీలు అంపశయ్యపైకి చేరుకునేందుకు అనేక అంశాలు దోహదం చేస్తున్నాయని ఎంవీపీ కాలనీలోని ఒక కాలేజీ ప్రిన్సిపాల్ నిట్టూర్చారు.

నత్తనడకన యూనిటీ మాల్ పనులు

... 5వ పేజీ తరువాయి

హస్తకళలు, చేనేత, ఇతర ఉత్పత్తులను ప్రోత్సహించి మార్కెటింగ్ చేయడానికి యూనిటీ మాల్ నిర్మాణానికి నడుం కట్టింది. వీటి ద్వారా డ్వాక్రా మహిళలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు లబ్ధి పొందుతారు. దేశంలో అన్ని రకాల కళలు, ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉంచుతారు. దీంతో పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది.

రిటైల్ మార్కెటింగ్‌కు అవకాశం

యూనిటీ మాల్‌లో 40 శాతం రిటైల్ మార్కెటింగ్ షాపులకు కేటాయిస్తారు. ప్రదర్శనలకు పెద్ద మందిరాలు నిర్మిస్తారు. శిక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. సాంస్కృతిక కళా ప్రదర్శనల కోసం వేదికలుంటాయి. రాష్ట్రంలో 26 జిల్లాలు ఉండగా ఒక్కో జిల్లాకు ఒక్కో స్టాల్ ఉంటుంది. అక్కడ ఆ జిల్లా ప్రత్యేకతను తెలిపే ఉత్పత్తులు, కళలు ఉంటాయి. ఉదాహరణకు అనకాపల్లి జిల్లానే తీసుకుంటే... ఏటికొప్పాక బొమ్మలు, బొజ్జన్నకొండ, అనకాపల్లి బెల్లం, మాడుగుల హల్వా ఇలా ఆ ప్రాంతం ప్రత్యేకతను తెలిపే ఉత్పత్తులు అందుబాటులో ఉంచుతారు. వాటిని ఆ ప్రాంతానికి చెందిన కళాకారులే విక్రయించుకుంటారు. వారి వ్యాపారానికి, ఉపాధికి ఇది పెద్ద వేదికగా నిలుస్తుంది. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా స్టాల్‌లో సేంద్రియ విధానంలో పండించిన వ్యవసాయ ఉత్పత్తులు ఉంచుతారు. కేంద్ర సహాయ మంత్రి ప్రకటించినట్టు దీనిని ఏడు నెలల్లో పూర్తి చేయాలంటే యుద్ధ ప్రాతిపదికన, వందలాది మందితో పనులు చేపట్టాల్సి ఉంది. కానీ ఇక్కడ ఆ పరిస్థితి కనిపించడం లేదు. పర్యవేక్షణ బాధ్యతలను ప్రత్యేక అధికారికి అప్పగిస్తే తప్ప సకాలంలో పూర్తిచేయడం కష్టమనే వాదనలు వినిపిస్తున్నాయి.

'సృష్టి గర్భ' పుస్తకావిష్కరణ


దీర్షాసి విజయభాస్కర్‌ను సత్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్, ఇతర సాహితీ ప్రముఖులు

సీతంపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో శ్రీమాతా కళాపీఠం ఆధ్వర్యంలో ప్రముఖ నాటక రచయిత డాక్టర్ దీర్షాసి విజయభాస్కర్ విరచిత సృష్టి గర్భ (ఉపనిషత్కాంతి) గ్రంథ ఆవిష్కరణ, పరిచయ సభ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆయన పుస్తక పరిచయాన్ని హృదయాలకు హత్తుకునేలా చెప్పారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాల వైపే 'సృష్టి గర్భ' చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా శ్రీమాతా కళాపీఠం అధినేతలు బి.ఎస్. మూర్తి, పల్లి నాగభూషణం సారథ్యంలో గ్రంథకర్త దీర్షాసి విజయభాస్కర్‌కి నాటక రత్న బిరుద ప్రదానం చేశారు. ముఖ్య అతిథులు ఆయనను ఘనంగా సత్కరించారు. గ్రంథకర్త తన స్పందనను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొలమరశెట్టి ఫ్రాన్సిస్, రామకృష్ణానంద్, డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ, విజయనగరం నగరపాలక కమిషనర్ పల్లి నల్లనయ్య, ప్రముఖ రచయిత వాడ్రేవు చిన్న వీరభద్రుడు, డాక్టర్ అందెశ్రీ, న్యాయవాది అల్లు కేశవ వెంకట జోగినాయుడు పాల్గొన్నారు.

అబు పర్వతంపై మాజీ సైనికుడి విజయం



రామరాజుకు బహుమతి అందిస్తున్న అతిథులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రైల్వేన్యూకాలనీలోని బ్రహ్మకుమారీల సంస్థ తరఫున లొల్ల గ్రామానికి చెందిన మాజీ సైనికుడు, ట్రై అథ్లెట్ దాట్ల రామరాజు రాజస్థాన్‌లోని మౌంట్ అబులో జరిగిన ఏడో దాదీ ప్రకాశ్మణి అంతర్జాతీయ హాఫ్ మారథాన్‌లో ప్రతిభ కనబరిచి విశాఖకు గౌరవం తెచ్చారు. వెటరన్ కేటగిరీలో పాల్గొన్న ఆయన కేవలం ఒక గంట నలభై మూడు నిమిషాల్లో పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచారు. ఈ అద్భుత ప్రదర్శనకు గాను ఆయనకు రూ.51 వేల నగదు బహుమతి లభించింది. ఈ హాఫ్ మారథాన్ ఆదివారం ఉదయం 6 గంటలకు అబు రోడ్డులోని మన్‌మోహిణీ వనం నుంచి ప్రారంభమై అరవల్లి కొండల మీదుగా మౌంట్ అబులోని ఓంశాంతి భవన్ వద్ద ముగిసింది. సుమారు 3,500 మంది జాతీయ, అంతర్జాతీయ రన్నర్లు పాల్గొన్న ఈ పోటీ సార్వత్రిక సోదరభావం వ్యాప్తి అనే శ్రేష్ఠమైన థీమ్‌తో నిర్వహించారు. విజేత రామరాజు మాట్లాడుతూ ఇది తనకు మరచిపోలేని అనుభవమన్నారు. ముఖ్యంగా మమైండ్, మెడిటేషన్, మారథాన్ రిట్రీట్‌లో గడిపిన రోజులు ఎంతో ప్రత్యేకంగా నిలిచాయన్నారు. మౌంట్ అబులో తన పర్యటన మొత్తం సమయంలో బ్రహ్మకుమారీలు అందించిన సేవలు, ఆత్మీయత ప్రశంసనీయమని తన అనుభూతులు పంచుకున్నారు. బ్రహ్మకుమారీలు ఆయనను అభినందించారు.

గంజాయిని తరలిస్తున్న కారు డ్రైవర్ అరెస్టు

» తుమ్మడిపాలెం రోడ్డుపై ఇటీవల జరిగిన ప్రమాదంలో బాలుడి మృతికి కారణం ఈ కారే

కంచరపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కారులో గంజాయితో ఉన్న వ్యక్తిని కంచరపాలెం పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 12న ఎన్ఏడీ వైపు నుంచి కంచరపాలెం మీదుగా వస్తున్న కారు తుమ్మడిపాలెం జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న భార్యాభర్తలను ఢీకొంది. ఈ ప్రమాదంలో రోడ్డు దాటుతున్న మహిళ ఎత్తుకున్న 15 నెలల బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు కేసును ఫైల్ చేసి కారును స్టేషన్‌కు తరలించారు. సీజ్ చేసిన కారును ట్రాఫిక్ ఎస్.ఐ శ్రీనివాస్ ఈ నెల 16న తనిఖీ చేయగా 21 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి కంచరపాలెం సీఐ రవికుమార్‌కు సమాచారం అందించారు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన అర్జునన్ జెమిని అద్భుతం (24)ఈ నెల 12న విజయవాడలో ఒక ప్రైవేటు సంస్థలో కారును ఆన్‌లైన్ ద్వారా అద్దెకు తీసుకున్నాడు. కారుతో అరకులోయ వెళ్లి అక్కడ 21 కిలోల గంజాయిని కొనుగోలు చేసుకుని ఎన్ఏడీ మీదుగా రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా తుమ్మడిపాలెం వద్ద ప్రమాదానికి కారణమయ్యాడు. ప్రమాదసమయంలో కారు తాళాలు లభ్యంకాకపోవడంతో విజయవాడ నుంచి కారు తాళాలు తెప్పించి సోదా చేశారు. కారు డిక్కీలో దాచిన 21 కిలోల గంజాయి బయటపడటంతో అర్జునన్‌ను రిమాండ్‌కు తరలించారు.

జి.సిగడాం-పొందూరు సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు


ట్రాక్‌పై అధికారులతో మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని జి.సిగడాం-పొందూరు సెక్షన్‌లో డీఆర్ఎం లలిత్ బొహ్రా ఆదివారం తనిఖీలు నిర్వహించారు. సెక్షన్‌లో జరుగుతున్న అధునాతన భద్రత సంబంధిత ట్రాక్ పనులను పరిశీలించారు. ట్రాక్‌లు, చక్రాలు, ట్రాక్‌ల భాగాల నిర్వహణకు సంబంధించిన రైల్ గ్రైండింగ్ మిషన్ (ఆర్‌జీఎం) పనితీరును పరిశీలించి భద్రత ప్రమాణాలు, సాంకేతికతపై ఆర్‌జీఎంకు చెందిన అధికారులతో సమీక్షించారు. రైల్వే మౌలిక సదుపాయాలు, భద్రతతోపాటు కార్యకలాపాల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించి నైపుణ్యాన్ని ప్రదర్శించాలని సూచించారు. విధుల నిర్వహణలో చిత్తశుద్ధితో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ పర్యటనలో సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (తూర్పు) సాయిరాజ్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గోడలు కూలినచోట మరమ్మతులు


పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ సంపత్‌కుమార్, గంకల కవిత

కంచరపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జీవీఎంసీ 48వ వార్డు ఏఎస్ఆర్ నగర్‌లో రెండు చోట్ల గోడ కూలిన నేపథ్యంలో ఆదివారం వార్డు కార్పొరేటర్ గంకల కవిత, ఆమె భర్త, బీజేపీ నాయకుడు గంకల అప్పారావుల ఆధ్వర్యంలో అధికారులు పర్యవేక్షించి మరమ్మతులు చేపట్టారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. కూలిన గోడలు స్థానంలో పనులు చేపట్టి నిర్మిస్తామని భరోసా ఇచ్చారు. శనివారం రెండు చోట్ల గోడలు కూలిన ప్రదేశాల్లో మట్టిని తొలగించి తరలించారు. వర్షం తగ్గగానే గోడలు నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఆదివారం ఉదయం, సాయంత్రం వరకు కొండవాలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఐదో జోన్ జడ్సీ రాము, ఎస్ఈ సంపత్ కుమార్, ఈఈ పద్మావతి, డీఈ భరణి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణకు ప్రభుత్వ పాలిటెక్నిక్ ఎంపిక

కంచరపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణకు ఎంపికైనట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్ పేర్కొన్నారు. ఈ శిక్షణను ఆన్‌లైన్ విధానంలో ఈ నెల 18 నుంచి 23 వరకు అందించనున్నారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి ఆమోదంతో అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) నిర్వహణ కోసం దేశవ్యాప్తంగా 6,500 దరఖాస్తులు రాగా, వాటిలో కేవలం 300 దరఖాస్తులను మాత్రమే ఎంపిక చేసినట్లు రత్నకుమార్ తెలిపారు. 'న్యూమరికల్ అప్రోచ్ ఇన్ డిజైన్ థింకింగ్' అనే ప్రతిష్టాత్మక శీర్షికతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సాంకేతిక విద్యా సంచాలకుడు జి.గణేష్ కుమార్ చీఫ్ ప్యాట్రన్‌గా వ్యవహరిస్తారు. డా.సీహెచ్.రాజు కో-ఆర్డినేటర్‌గా, ఎం.భరణి సహ సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. మెకానికల్ విభాగం హెడ్ ఫణికృష్ణ ఆధ్వర్యంలో కోర్సు నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ప్రిన్సిపాల్ తెలియజేశారు.


శిక్షణ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్ తదితరులు



గణపతినీడి శ్రీనివాసరావుకు పుస్తకాన్ని అందజేస్తున్న మంత్రి లోకేశ్

నారా లోకేశ్‌ను కలిసిన వాజీ చానల్ ఎండీ

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను వాజీ చానల్ ఎండీ గణపతినీడి శ్రీనివాసరావు ఆదివారం విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా వారు ఉత్తరాంధ్రలోని రాజకీయ, పాలనాపరమైన అంశాలపై చర్చించారు. ఉత్తరాంధ్రలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను, ముఖ్యంగా విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం జిల్లాల్లో కూటమి ప్రభుత్వ పాలన తీరును ఆయన లోకేశ్‌కు వివరించారు. యువగళం పాదయాత్ర అనుభవాలతో కూడిన పుస్తకాన్ని మంత్రి నారా లోకేశ్ గణపతినీడి శ్రీనివాసరావుకు బహూకరించారు.

క్యాన్సర్ నిరోధక టీకా శిబిరం

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రసాదించిన ఆహార పదార్థాలను తీసుకోవడంతో పాటు పూర్వీకులు ఆచరించిన ఆరోగ్య విధానాలను అనుసరిస్తే క్యాన్సర్ వంటి వ్యాధులు దరిచేరవని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. అమెరికాకు చెందిన మానవ సేవా ట్రస్టు, దిగుమర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో క్యాన్సర్ వ్యాధి నిరోధక టీకా ఉచిత వ్యాక్సిన్ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్యాన్సర్ నివారణకు మానవ సేవా ట్రస్టు, దిగుమర్తి సేవా ఫౌండేషన్లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దిగుమర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు దిగుమర్తి రఘునాథరావు, సైంటిస్టు ఎస్.కాళిదాసు, తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో సుమారు 200 మంది బాలికలకు ఉచితంగా వాక్సిన్‌ను వేశారు.

విధుల్లోకి తీసుకోవాలని డెయిరీ కార్మికుల వేడుకోలు

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తాము ఏ కార్మిక సంఘంలోనూ లేమని, అందువల్ల విశాఖ డెయిరీ యాజమాన్యం తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేశారు. ఇటీవల డెయిరీ యాజమాన్యం విధుల నుంచి తొలగించిన కాంట్రాక్టు కార్మికులు ఆదివారం అక్కిరెడ్డిపాలెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)కు, తమకు ఎటువంటి సంబంధం లేదన్నారు. పర్మినెంట్ చేయిస్తామని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తమను ప్రలోభపెట్టి తమ జీవితాలను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల విశాఖ డెయిరీ యాజమాన్యం స్పందించి తమ కుటుంబాలను ఆదుకోవలసిందిగా కార్మికులు పి.భాస్కరరావు, డీఎస్ఎం బాబు, చిన్నారావు, వెంకటరావు, ఢిల్లీరావు, బాబూరావు, తదితరులు కోరారు.

సినిమా గైడ్

● **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం).
● **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం).
● **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24, టమాటా 48, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 18, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 22, బీరకాయలు 28, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 20, క్యారెట్ 42, దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటి కాయ (పె)10, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 64, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 58, కీరదోస 30, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడ దుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230



వడ్లపూడి రైల్వే క్వార్టర్స్ నుంచి సుందరయ్య కాలనీ వైపు ముంపునకు గురైన రోడ్డు



50 అడుగులకు చేరిన మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం



గాజువాక-కణితి మార్గంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

కుండపోత

లోతట్టు ప్రాంతాలు జలమయం
చెట్లు కూలి పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం
రహదారుల్లోని గోతుల్లో వర్షపు నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు



ఐవోసీ ప్రాంగణం నీట మునిగిన దృశ్యం

గాజువాక, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. భారీ వర్షాల మూలంగా లోతట్టు ప్రాంతాలన్నీ జలమయ మయ్యాయి. అసలే అంతంత మాత్రంగా ఉన్న రహదారులు మరింత అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాన నీటితో నిండిన గోతులు కనిపించక, వాటి మీదుగా రాకపోకలు సాగించడం వల్ల ద్విచక్ర వాహనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. ఆదివారం ఉదయం నుంచి తెరిపివ్వకుండా వాన కురుస్తుండడంతో నిత్యం కళకళలాడే రోడ్లన్నీ బోసిపోయాయి. వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చే వారందరూ రెయిన్ కోట్లు, గొడుగులను ఆశ్రయించారు. కొన్నిచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది. వర్షాల నేపథ్యంలో జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. డ్రైనేజీలు, పెద్ద కాలువల్లో వర్షపు నీరు సులువుగా దిగువ ప్రాంతాలకు పోయేందుకు వీలుగా తగిన చర్యలు తీసుకుంటున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

కూర్మన్నపాలెం: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు 70వ వార్డు పరిధి ఎల్‌వీనగర్, 71వ వార్డు ఆటోనగర్, తోకాడ, ఎంఎస్ఎంఈ కార్యాలయం రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 86వ వార్డు పరిధి రాజీవ్ నగర్ రోడ్డులో ఓ చెట్టు కూలగా, జీవీఎంసీ సిబ్బంది తక్షణమే తొలగించారు. 87వ వార్డు పరిధి వడ్లపూడి రైల్వే క్వార్టర్స్ నుంచి సుందరయ్య కాలనీ వరకు గల రహదారి ముంపునకు గురైంది. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో హైవే మీదుగా శ్రీనగర్ నుంచి కూర్మన్నపాలెం వైపు వాహనాలను మళ్లించారు. వడ్లపూడి, సిద్ధార్థనగర్ వాటర్ ప్లాంట్, పకీర్ తఖ్యా, రాజీవ్ నగర్, రాసాలమ్మ కాలనీ, ఎన్టీఆర్ నగర్, కణితి, వడ్లపూడి, ఉప్పరకాలనీ, యాతపాలెం, కాపుజగ్గరాజుపేట, సాయిరాంనగర్, రేడియో స్టేషన్ రోడ్లపై నీరు వరదలా ప్రవహించడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధాన డ్రైనేజీలు వాన నీటితో పొంగిపొర్లాయి.

స్తంభించిన జనజీవనం

పెందుర్తి: తెరిపివ్వకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. పలు కాలనీల్లో వర్షపు నీరు రహదారులపై పెద్దఎత్తున ప్రవహించింది. వర్షపు నీటితో పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి జలమయమైంది. నీరు ప్రవహించే మార్గం లేక రహదారిపైనే నిలిచిపోయింది. చినముషిడివాడలోని చాణక్య నగర్, క్రాంతినగర్ కాలనీలు, పెందుర్తిలోని దొగ్గవానిపాలెం, సుజాతనగర్‌లో నాగమల్లి లేఅవుట్ ఎనభై అడుగుల రోడ్డు బురదమయం కావడంతో పాదచారులు సైతం అడుగు తీసి వేయలేని దుస్థితి నెలకొంది. జుత్తాడలోని జగన్న కాలనీ రోడ్డు బురదతో చిత్తడిగా మారింది. ద్విచక్ర వాహనదారులు బురదమయమైన రోడ్లపై వెళితే ఎక్కడ జారి పడతామోనని భయాందోళన చెందుతున్నారు. పాత పెందుర్తిలోని జడ్పీ పాఠశాల ప్రాంగణం చిత్తడిగా మారింది.

పొంగిపొర్లిన గెడ్డలు

గోపాలపట్నం: కుండపోతగా కురిసిన వర్షానికి గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని గెడ్డలు పొంగిపొర్లాయి. గోపాలపట్నం కొండవాలు ప్రాంతం నుంచి వచ్చిన వరద నీరు కొత్తపాలెం అండర్‌పాస్‌వే మీదుగా శివారులోని లోతట్టు ప్రాంతాలకు చేరింది. ఏటా వర్షాకాలంలో కొత్తపాలెం శివారులో వరద ముంపు ప్రభావంతో లోతట్టు ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాలు నీట మునుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాకాలం రాక ముందు నుంచే కొత్తపాలెం శివారులో జీవీఎంసీ సిబ్బంది కాలువలు, గెడ్డల్లో పూడికతీత పనులు చేపట్టి గెడ్డలను కాస్త వెడల్పు చేశారు. దీంతో ఇప్పుడు ముంపు సమస్య తలెత్తలేదు. ఇదిలావుండగా మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ 50 అడుగులకు చేరింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఒకడుగు నీటిమట్టం పెరిగింది. రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం 61 అడుగులు. మరింతగా భారీ వర్షాలు కురిస్తే గానీ నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరుకునే అవకాశం లేదు.

పలుచోట్ల కూలిన చెట్లు

వర్షం కారణంగా నాగేంద్రకాలనీ, చంద్రనగర్ ప్రాంతాల్లో కొన్ని చెట్లు కూలాయి. చంద్రనగర్ రజక కాలనీ వద్ద భారీ వృక్షం విద్యుత్ వైర్లపై కూలడంతో సమీపంలోని రెండు స్తంభాలు విరిగిపోయాయి. దీంతో ఆదివారం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది. విద్యుత్ వైర్లపై చెట్లు కూలిన సమాచారం అందుకున్న వెంటనే సంబంధిత సిబ్బంది ఆ చెట్టును తొలగించి తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేస్తామని ఏఈ శ్యామ్ తెలిపారు.



86వ వార్డు రాజీవ్ నగర్‌లో కూలిన చెట్టు



జలమయమైన పెందుర్తి కూడలి



నాయుడుతోట దుర్గానగర్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ

ఉధృతంగా ప్రవహించిన బొర్రమ్మ గెడ్డ

అగనంపూడి: అగనంపూడి, పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం వేకువజాము నుంచి తెరిపివ్వకుండా వాన కురవడంతో ఎవరూ బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ప్రధాన గెడ్డలు పొంగి ప్రవహించాయి. ముఖ్యంగా కొండవాగు నుంచే వచ్చే బొర్రమ్మ గెడ్డ నీటి ఉధృతి కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. దువ్వాడ ప్రధాన రహదారిలో పెద్దఎత్తున వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు నానాపాట్లు పడ్డారు. జాతీయ రహదారి అగనంపూడి ఆస్పత్రి సమీపంలో రోడ్డు కోతకు గురైంది..

ఏకమైన రోడ్లు, డ్రైనేజీలు

పెదగంట్యాడ: జోరువానకు పెదగంట్యాడ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లు, డ్రైనేజీలు ఏకమయ్యాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు కుండపోతగా వర్షం కురుస్తూనే ఉండడంతో పెదగంట్యాడ పారిశ్రామికవాడ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీల కంటే రోడ్డు పల్లంగా ఉండడంతో అందులో నుంచి మురుగు, వర్షపు నీరు పొంగి రోడ్లపై ప్రవహించింది. ఆటోనగర్, హెచ్‌బీ కాలనీ, బర్మా కాలనీ, రిక్షా కాలనీలోని లోతట్టు ప్రాంతాల్లో పెద్దఎత్తున వర్షపు నీరు చేరింది. ప్రధాన కాలువలో పూడిక చేరడంతో నీరు దిగువ ప్రాంతానికి సజావుగా వెళ్లక రోడ్డుపై పొంగిపొర్లింది. కొండవాలు ప్రాంతాల్లో ఉన్న దయాళ్‌నగర్, అశోక్ నగర్, గిరిజా కాలనీ వీధి రోడ్ల నుంచి పెద్దఎత్తున వర్షపు నీరు ప్రవహించింది.

చెరువులను తలపించిన రోడ్లు

అక్కిరెడ్డిపాలెం: వర్షాలకు 68, 69 వార్డుల పరిధిలో గల పలు కాలనీల రోడ్లు జలమయమయ్యాయి. జాతీయ రహదారి నుంచి సబ్బవరానికి వెళ్లే షీలానగర్ ప్రధాన రహదారిలో హరిజన జగ్గయ్యపాలెం, వెంకటేశ్వరకాలనీల వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో చెరువుల్లా మారాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. షీలానగర్ నుంచి అక్కిరెడ్డిపాలెం వరకు ఉన్న సర్వీసు రోడ్డులో పెద్దఎత్తున వర్షపు నీరు తిష్ఠ వేయడంతో వాహనాల రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది.

సర్వీసు రోడ్డులో నిలిచిన నీరు

ఎన్.ఎ.డి.జంక్షన్: భారీ వర్షానికి ఎన్ఏడీ గణేష్‌నగర్, వుడా కాలనీ సంజీవయ్య కాలనీ ఎన్ఎస్‌టీఎల్ గేటు పరిసరాల్లో, ఎన్ఏడీ ఫ్లైఓవర్‌కు వెళ్లే సర్వీసు రోడ్డులోని ఎన్ఎస్‌టీఎల్ మలుపు వద్ద పెద్దఎత్తున వర్షపు నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. అలాగే వినోద్‌నగర్, సాకేతపురం, కాకానీనగర్, విమాన్‌నగర్ శివారు ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు తిష్ఠ వేసింది. విమాన్‌నగర్ వైకుంట వేంకటేశ్వరాలయం ఎదురుగా రైల్వే పనులు చేపడుతున్నందున రోడ్డంతా బురదమయంగా మారింది. పలు ప్రాంతాల్లో విరిగిన చెట్లను విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించారు. బుచ్చిరాజుపాలెం బీఆర్‌టీఎస్ బస్టాప్ వద్ద, సర్వీసు రోడ్డులో మోకాల్లోతు వరకు నీరు చేరింది. ఎన్ఏడీ లోతట్టు ప్రాంతాలను మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. పలుచోట్ల యూజీడీ మ్యాన్‌హోల్స్ ఓపెన్ చేసి మురుగు పోయేలా చేశారు. కాగా నాయుడుతోట దుర్గానగర్ వద్ద గెడ్డ ఉధృతంగా ప్రవహించింది. అప్పలనర్సయ్యనగర్, సాయివెంకటనగర్ కొండ పైనుంచి వర్షపు నీరంతా రోడ్డుపైకి రావడంతో వాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు.

సింధియా: సింధియా పరిసర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు, రహదారులు చెరువులను తలపించాయి. సింధియా నుంచి గాజువాక వెళ్లే ప్రధాన రోడ్డు వర్షపు నీటితో నిండడంతో వాహనచోదకులు నానాపాట్లు పడ్డారు. కొండవాలు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున నీరు దిగువకు రావడంతో డ్రైనేజీలు పొంగిపొర్లాయి. యారాడ బస్టాప్, ఏకేసీ కాలనీ, మల్కాపురం పోలీస్ స్టేషన్, నౌసేనాబాగ్, కేవీ స్కూల్, తదితర ప్రాంతాల్లో నీట మునిగాయి. ఎంఈఎస్ గేట్ ఎదురుగా ప్రధాన రోడ్డు ముంపునకు గురవ్వడంతో వాహనదారులు ప్రత్యామ్నాయ దారుల్లో రాకపోకలు సాగించారు.

ఇళ్లలోకి చేరిన వరద నీరు



శ్రీరామ్ నగర్‌లో ఇళ్లలోకి ప్రవేశించిన వర్షపు నీరు

మల్కాపురం: గ్రేటర్ 58వ వార్డు పరిధి శ్రీరామ్‌నగర్‌లో గల కొన్ని ఇళ్లలోకి వర్షపు నీరు పెద్దఎత్తున చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలోని అన్ని గదుల్లోకి వాన నీరు చేరడంతో సామగ్రి పాడైపోతాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీరు బయటకు పోయేందుకు మార్గం లేకపోవడంతో ప్రజలే తమ ఇళ్లలో చేరిన బకెట్లతో బయట పడేస్తున్నారు. ఈ కాలనీకి సమీపంలో ఉన్న నేవీ ప్రహరీకి అటువైపు అడ్డంగా పెద్దపెద్ద పైపులు పెట్టడంతో వర్షపు నీరు ప్రధాన గెడ్డలోకి వెళ్లడం లేదు. దీంతో భారీ వర్షల సమయంలో వర్షపు నీరు సమీపంలోని ఇళ్లలోకి వచ్చేస్తోంది. ఎంతోకాలంగా ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కారానికి పటిష్ఠ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

నీట మునిగిన ఐవోసీ ప్రాంగణం

భారీ వర్షాలకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) ప్రాంగణం నీట మునిగింది. ఎప్పుడూ తెరిపివ్వకుండా వర్షాలు కురిసినా ఇక్కడ ఇదే పరిస్థితి నెలకొంటోంది. పలు మార్లు జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు ఇక్కడ గెడ్డల పరిస్థితిని తీర్చిదిద్దినా వానొస్తే మాత్రం ఈ ప్రాంతం ముంపునకు గురవుతుంటుంది. ప్రస్తుతం ఆయిల్ ట్యాంకర్ల ఇంజన్ల వరకు కూడా వర్షపు నీరు చేరింది. వర్షం కారణంగా ఐవోసీలో చమురు ఉత్పత్తుల లోడింగ్ పనులకు ఆటంకం కలుగుతోంది. కాగా కోస్టుగార్డు హెడ్ క్వార్టర్స్ (పాత పోర్టు క్వార్టర్స్) ఏరియా, హెచ్‌పీసీఎల్ మెయిన్ గేటు వద్ద పెద్దఎత్తున వాన నీరు తిష్ఠ వేసింది.

బీజేపీ, ఈసీ అరాచకాలకు అడ్డుకట్ట వేయాలి

కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గత లోక్‌సభ ఎన్నికల్లో అనేకచోట్ల ఈసీతో కలిసి బీజేపీ చీటింగ్‌కు పాల్పడిందని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు ఆరోపించారు. ఆదివారం ఉదయం నగర పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ సెంట్రల్ నియోజకవర్గంలో జరిగిన ఓట్ చోరీ వ్యవహారంపై రాహుల్‌గాంధీ ఆధారాలతో సహ వివరాలను వెల్లడించారని, ఒకే ఇంట్లో 80కు పైగా ఓట్లు ఉన్నట్టు చూపించారని పేర్కొన్నారు. ఇటువంటి అనేక ఆ నియోజకవర్గంలో జరిగినట్టు రాహుల్‌గాంధీ వివరించారన్నారు. బీజేపీ, ఈసీ కలిసి చేస్తున్న అరాచకాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. స్టాప్ ఓట్ చోరీ పేరుతో రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా పెద్దఎత్తున క్యాంపైన్ ప్రారంభించారని, దీనిద్వారా ప్రజల్లో అవగాహన కలిగించే ప్రయత్నం చేస్తామని రుద్రరాజు పేర్కొన్నారు. అలాగే బిహార్‌లో లక్షల ఓట్లను డిలీట్ చేశారని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాహుల్‌గాంధీ 13 రోజులపాటు 1,600 కిలోమీటర్ల పాదయాత్రను బిహార్‌లో ప్రారంభించారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డాల వెంకట వర్మరాజు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ప్రారంభించిన ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ లక్కరాజు రామారావు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా బీజేపీ, ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తోందన్నారు. సమావేశంలో ఏపీసీసీ వైస్ ప్రెసిడెంట్ వేగి వెంకటేశ్, పలు నియోజకవర్గాల సమన్వయకర్తలు కేవీ సూర్యనారాయణ, దండి ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

ఉమ్మడి జిల్లా ఎన్‌జీవోఎస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవికుమార్



అగనంపూడి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉమ్మడి జిల్లా కమర్షియల్ ట్యాక్స్ ఎన్‌జీవోఎస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పీలా సూర్యనారాయణ (రవికుమార్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం లంకెలపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా జగదీశ్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాఘవేంద్ర, ట్రెజరర్‌గా బాల రవికిరణ్, ఉపాధ్యక్షులుగా అప్పలరాజు, రాజేశ్, సంయుక్త కార్యదర్శులుగా సుశీల, కుమార్‌లను ఎన్నుకున్నారు. నూతనకార్యవర్గాన్ని సంఘం రాష్ట్రం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్‌బాబు, సుధాకర్, నాయకులు రత్నకుమార్, రమేశ్‌కుమార్, పురుషోత్తంనాయుడు, ఈశ్వరరావులు అభినందించారు.

పోలీసుల అదుపులో చోరీ కేసు నిందితుడు?

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఉక్కు టౌన్‌షిప్‌లో శనివారం జరిగిన చోరీ కేసుకు సంబంధించిన నిందితుడిని స్టీల్‌ప్లాంట్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. సౌత్ డివిజన్ క్రైమ్ పోలీసుల విచారణలో భాగంగా దొంగతనం జరిగిన క్వార్టర్స్ ముందు ఓ నివాసంలో గల సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించినట్టు సమాచారం. నిందితుడు పాత నేరస్థుడని, అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు, సొత్తు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.



కాబోయే వధూవరులతో ప్రముఖులు

ఘనంగా ఎమ్మెల్యే కొణతాల కుమార్తె నిశ్చితార్థ వేడుక

హాజరైన వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కుమార్తె రమ్య, అనంత్ నిశ్చితార్థ వేడుక బీచ్ రోడ్డులోని హోటల్ నోవాటెల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. వీరిలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యేలు పి.విష్ణు కుమార్‌రాజు, సుందరపు విజయ్‌కుమార్, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, తదితరులు ఉన్నారు.

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్

కూర్మన్నపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వర్షంలో సైతం దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ఆదివారం పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్‌ఆర్‌సీసీ సభ్యుడు కె.ఈశ్వర్, కూర్మన్నపాలెం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎ.మురళీధరరెడ్డి, రైల్వే యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాషువా, తదితరులు టికెట్ కౌంటర్, వీఐపీ లాంజ్, పార్కింగ్, తదితర ప్రాంతాలను శుభ్రపరిచారు.

చంపేస్తామని బెదిరించి రూ.వెయ్యి దోపిడీ

పెందుర్తి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి సమీప సరిపల్లి రోడ్ ఓవర్ బ్రిడ్జి రాంపురం మార్గంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తిని నలుగురు దుండగులు అడ్డగించి, చంపేస్తామని బెదిరించి వెయ్యి రూపాయలు దోపిడీ చేశారు. క్రైమ్ ఎస్ఐ సూరిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొరపల్లి పంచాయతీ పరిధి కరకవానిపాలేనికి చెందిన ఎస్.సంతోష్ ఎయిర్‌పోర్టులో గల ఇండిగో సంస్థలో లోడర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం విధులు ముగించుకుని బైక్‌పై వస్తుండగా రాంపురం జంక్షన్ వద్ద మద్యం సేవించిన నలుగురు యువకులు అడ్డుకుని రాళ్లతో దాడి చేశారు. డబ్బులివ్వకపోతే చంపేస్తామని బెదిరించి, సంతోశ్ వద్దనున్న రూ.వెయ్యి లాక్కున్నారు. సంతోశ్ వారినుంచి తప్పించుకుని బైకుపై పెందుర్తి వైపు వచ్చి ఓ ఏటీఎం కేంద్రంలో దాక్కున్నాడు. తనపై దాడి జరిగినట్టు స్నేహితులతో చెప్పడంతో వారు పెందుర్తి వచ్చారు. అదే సమయంలో దుండగులు సంతోశ్ కోసం వెదుకుతుండగా ఆయన స్నేహితులు వారిని పట్టుకునేందుకు యత్నించారు. ఒకడు పట్టుబడగా, మిగతా ముగ్గురు పారిపోయారు. ఆ వ్యక్తిని పోలీసులకు అప్పగించి, జరిగిన సంఘటనపై సంతోశ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

నేడు ఉక్కు పరిపాలన భవనం ముందు భారీ ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లోని కీలకమైన 34 విభాగాలను ప్రైవేటీకరణ చేసేందుకు ఉక్కు యాజమాన్యం నోటిఫికేషన్లు ఇవ్వడాన్ని నిరసిస్తూ సోమవారం ప్లాంట్ పరిపాలన భవనం ఎదుట భారీ ధర్నా చేయనున్నట్టు ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచే ధర్నాకు దిగుతామని, ఉక్కు యాజమాన్యం ఇచ్చిన ఈవోఐ నోటిఫికేషన్లను ఉపసంహరించుకునేంత వరకు పోరాటాలు చేస్తామని వారు స్పష్టం చేశారు. ధర్నాలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనవలసిందిగా కోరారు.